ఆగస్టు 2026
రు. 20/-

# చైతన్యం

సంకల్ప బలం

సామాజిక విలువల మాసపత్రిక




FIFA WORLD CUP 2026
CHAMPIONS


స్పెయిన్ వరల్డ్ కప్ గెలిచిన సందర్భంలో
మాడ్రిడ్లో సంబరాలు




# చైతన్యం

సంకల్ప బలం

సామాజిక విలువల మాస పత్రిక

ఆగస్టు 2026

సంపుటి -15 సంచిక - 11



వ్యవస్థాపక సంపాదకురాలు

**తీగవరపు శాంతి**


## ఈ సంచికలో....


| | |
|---|---|
| సంపాదకీయం | 4 |
| వార్తా విశేషాలు | 6 |
| సుభాషితాలు | 30 |
| కాశి మజిలీ కథలు | 31 |
| ఒకే అవసరం. ఒకే వ్యక్తి. రెండు వ్యక్తిత్వాలు | 35 |
| శ్రావణమాసం-పండుగలు | 37 |
| ఆంధ్ర విశ్వవిద్యాలయం | 39 |
| కలియుగ ప్రత్యక్ష దైవం | 41 |
| శ్రీ ఆంజనేయం | 46 |
| జర్నలిస్ట్ ఫోరం | 49 |



రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

పాఠక దేవుళ్ళకు 80 వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

భారతదేశం 2026 ఆగస్టు 15 వ తేదీన 80 వ స్వాతంత్ర దినోత్సవం జరుపుకోనుంది . దాదాపు 200 సంవత్సరాల బ్రిటిష్ పాలన తర్వాత 1947 ఆగస్టు 15 న స్వాతంత్ర్యం పొందింది. బ్రిటిష్ వారి పాలన నుండి విముక్తి లభించడంతో, ఈ ఆగస్టు 15 వ తేదీన దేశ స్వాతంత్ర్య సమార యోధుల త్యాగాలను స్మరించు కోవడానికి, మన దేశ ప్రగతిని కొనియాడడానికి ఎంతో వేడుకగా జరుపు కుంటాము. ప్రధానమంత్రి ఎర్రకోటపై జాతీయ జెండాను ఎగురవేసి, దేశాన్ని ఉద్దేశించి రాష్ట్రపతి, ప్రధాన మంత్రి ప్రసంగిస్తారు. మహాత్మా గాంధీ, సుభాష్ చంద్ర బోస్, భగత్ సింగ్ వంటి ఎందరో వీరుల త్యాగాలను ఆ రోజున గుర్తు చేసుకుంటాం.

అలాగే మన దేశంలోని అన్ని రాష్ట్రాలలో, పాఠశాలలో, ప్రభుత్వ కార్యాలయాల్లో జెండా వందన కార్యక్రమాలు, సాంస్కృతిక వేడుకలు నిర్వహిస్తారు.

తెలంగాణ వార్తలు :

తెలంగాణాలో 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసు గౌరవ వందనం స్వీకరిస్తారు. శకటాల ప్రదర్శన ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కొత్త రేషన్ కార్డులు పంపిణీ వంటి ప్రత్యేక కార్యక్రమాలు ఈ వేడుకల సందర్భంగా ప్రారంభిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తారు. ఆగస్టు 9 నుంచి 17 వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేసేలా ప్రజలను భాగస్వామ్యం చేస్తున్నారు. పాఠశాలల్లో, విశ్వ విద్యాలయాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, దేశ భక్తి గీతాలు, పోటీలు నిర్వహిస్తున్నారు.

మనం దేశవ్యాప్తంగా వేడుకలు చేసుకుంటున్నాం. ప్రజలంతా ప్రతి ఒక్కరూ మన కుటుంబమే కాదు, దేశ అభివృద్ధి కూడా నా బాధ్యత అని భావించాలి. అధర్మం, అన్యాయం, ఒకరిని మోసం చేయడం, దేశ ధనం కూడా మన ధనమే అని భావించి ప్రతి ఒక్కరు ఉంటేనే, మన భారత దేశ అభివృద్ధే కాదు, ముందు తరాల వాళ్లకి మార్గం చూపిస్తూ, పునాదులు వేసిన వాళ్ళం అవుతాం. మన కుటుంబ ఆస్తి మన పిల్లలకు ఇచ్చి తృప్తి పడకూడదు మనం. దేశ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని చేసే ప్రతి పని, ప్రతి ప్రాజెక్టు, ప్రతి అభివృద్ధి కార్యక్రమం మాత్రమే మన పిల్లల సంక్షేమం, మన పిల్లలకు ఇచ్చే ఆస్తి అని మనం అందరం గుర్తెరగాలి.

రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ, వరుణ యాగం నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం అర్చకులు, వేద పండితులు ఈ నెల 10న ముహూర్తం ఖరారు చేశారు. నాగార్జున సాగర్ లో విజయ విహార్ ప్రాంగణంలో ఈ యాగానికి సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు. గోదావరి, నదులు, చెరువులు, జలకళ సంతరించుకోవాలని, పాడి పంటలు సమృద్ధిగా ఉండాలనే సంకల్పంతో ప్రత్యేక పూజలు చేయనున్నారు.

బోనాలు

తెలంగాణ రాష్ట్రంలో అత్యంత వైభవంగా జరుపుకునే చారిత్రిక, సాంస్కృతిక జానపద పండుగ బోనాలు. ఆషాఢ మాసంలో మహాకాళి (పోచమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ ) అమ్మవారికి మహిళలు వంటకం (బోనం) నైవేద్యంగా సమర్పిస్తారు. 2026 జులై 19 నుండి ఆగస్టు 9 వరకు ఆదివారాల్లో ఈ వేడుకలు ఘనంగా జరుగుతాయి. జులై 19 .. గోల్కొండ బోనాలతో ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. జులై 26న సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాలు, ఆగస్టు 02 న లాల్ దర్వాజా, పాత బస్తీ శ్రీ మహంకాళి అమ్మవారి బోనాలు, ఆగస్టు 09 న హైదరాబాద్ వ్యాప్తంగా చివరి దశ బోనాల ఉత్సవాలు.

బోనం తయారీ .. అన్నం, బెల్లం లేదా పాలు, పెరుగు కలిపి మట్టి లేదా రాగి పాత్రలో వండుతారు. దీన్ని పసుపు, కుంకుమ, వేపాకులతో అలంకరిస్తారు. బోనాన్ని మహిళలు పవిత్రంగా తమ తలపై పెట్టుకుని, మంగళ వాయిద్యాల నడుమ ఆలయానికి వస్తారు. అమ్మవారి రక్షకులు గా భావించే పోతురాజుల డప్పు చప్పుళ్లకు అనుగుణంగా, ఉత్సాహంగా నృత్యం చేస్తారు. దేశ విదేశాలలో నివసిస్తున్న మన తెలంగాణ ప్రజలు అందరూ కూడా ఎంతో భక్తి శ్రద్ధలతో ఈ పండుగను జరుపుకుంటారు.

ఆంధ్రప్రదేశ్ వార్తలు :

విజయనగరం జిల్లా భోగాపురం వద్ద నిర్మించిన అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్త-

రాంధ్ర అభివృద్ధి లో కీలక మైలురాయి. ఆగస్టు 1 2026 న ప్రారంభమైన ఈ విమానాశ్రయాన్ని సుమారు రూ 5, 640 కోట్ల వ్యయంతో జిఎంఆర్ గ్రూప్ దీనిని పిపిపి విధానంలో నిర్మించింది. ఇది మొదటి దశలో ఏడాదికి 6 మిలియన్ల ప్రయాణీకులను, భవిష్యత్తులో 40 మిలియన్ల వరకు హ్యాండిల్ చేయగలదు అని నిపుణుల అంచనా. ఎంతో అందమైన విమానాశ్రయాన్ని నిర్మించడం, ఒక ఎత్తయితే, దాన్ని మెయింటైన్ చెయ్యడం మరో ఎత్తు. ఈ బాధ్యత ప్రభుత్వానికి ఎంత ఉంటుందో, ప్రజలకు కూడా అంతే ఉంటుంది అనడంలో సందేహం లేదు.
విమానాశ్రయానికి ముందు అందంగా మొక్కలు వేస్తే, అక్కడ ప్రజలు వారి సొంతంగా భావించి పీకి పట్టుకుని వెడుతున్నవి సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. సీసీ కెమెరాలో చూసి, అటువంటి వారిని వదిలేయకుండా ఒక్కసారి కఠిన చర్యలు తీసుకుంటే, ఇంకెవరూ చెయ్యరు అని భావిస్తున్నారు అంతా.

దేశీయ వార్తలు :

పేపర్ లీక్

పరీక్ష ప్రశ్న పత్రాలు పత్రాలు పరీక్షలకు ముందే అనధికారంగా బయటకి రావడంతో, రాత్రి, పగలు కష్టపడి ఇన్నాళ్లు చదువుకున్న విద్యార్థులకు అన్యాయం జరుగుతుంది. తెలివైన విద్యార్థుల ప్రతిభకు విలువ, గుర్తింపు ఉండదు. అంతే కాదు తెలివైన విద్యార్థులంతా నిరాశకు గురి అవడంతో, ఆ కుటుంబమే కాదు దేశం కూడా తెలివైన వారిని కోల్పోతోంది. మళ్ళీ తిరిగి పరీక్ష పెట్టాం అని చెప్పే వారికి సులువే, మళ్ళీ వాళ్ళు ఆ మూడ్ తెచ్చుకుని చదవాలంటే ఎంత కష్టం. మరల అలాగే, అంత బాగా వ్రాయలేక పోవచ్చు నిరాశకు గురి కావడం జరుగుతుంది. ఆ పిల్లలే కాదు, కుటుంబాలు కూడా మానసికంగా కృంగి పోతాయి. ఇన్ని విషయాలు ప్రభుత్వం దృష్టిలో పెట్టుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీనిపై కఠిన చట్టాలు తెచ్చినా (యాంటీ పేపర్ లీక్ బిల్లు ) వ్యవస్థలో కూడా మార్పు రావాలని నిపుణులు కోరుకుంటున్నారు .

పార్లమెంట్ లో ప్రతిస్తంభన

విద్యార్థులపై పోలీసుల బల ప్రయోగం, నీట్ పేపర్ లీక్, అయోధ్యలో విరాళాల స్వాహా వంటి అంశాలపై విపక్షాలు ఆందోళన కొనసాగించడంతో ఉభయ సభల్లో చర్చ లేవీ శుక్రవారం జరగలేదు. గత నెల 20న ఢిల్లీలో విద్యార్థులపై పోలీసుల బల ప్రయోగానికి సంబంధించి కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వయంగా వివరణ ఇవ్వాలని రాజ్య సభలో, లోక్ సభలో ప్రతిపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. విపక్షాల ఆందోళన మధ్యే .. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి బిల్లు --2026 ను లోక్ సభ ఎలాంటి చర్చ లేకుండా ఆమోదించింది. రాజ్యసభలో ఈ బిల్లుకు ఈ నెల 3 వ తేదీనే ఆమోద ముద్ర పడింది.

అంతర్జాతీయ వార్తలు:

అమెరికా చట్టసభ సభ్యుడికి భారత్ కౌంటర్ -- ఇది మా అంతర్గత వ్యవహారం

విదేశీ విరాళాల నియంత్రణ చట్టంలో సవరణకు సంబంధించి ప్రతిపాదిత బిల్లు (FCRA BILL) పై అమెరికాకు చెందిన ఓ చట్ట సభ్యుడు చేసిన వ్యాఖ్యలపై భారత్ ధీటుగా స్పందించింది. చట్టాలు సవరణలు చేసుకోవడం భారత్ అంతర్గత వ్యవహారాలని స్పష్టం చేసింది.

రూ 11 కోట్ల లాటరీ టికెట్ చెత్త బుట్టలో

ఇటలీలో ఓ మహిళ దాదాపు రూ 11 కోట్లు లాటరీ టికెట్ తగిలినా ... ఆ విషయం తెలియక టికెట్ ను చెత్త బుట్టలో పడేసింది. అదృష్టవ శాత్తు పారిశుధ్య కార్మికుల కృషితో టికెట్ మళ్ళీ దొరకడంతో, ఆమె ఆనందానికి అవధుల్లేవు.

80 సంవత్సరాల స్వాతంత్ర్యానుభవంతో ప్రజలు అధికారులు అందరం కలిసి, మన ఆచారవ్యవహారాలు పాటిస్తూ, ధర్మ పరిరక్షణలో జీవితాన్ని గడపడమే కాక, రాబోయే తరాలకు అందరం ఆదర్శంగా ఉందామా !

సర్వేజనాః సుఖినోభవంతు



తీగవరపు శాంతి

# వార్తా విశేషాలు

## అమెజాన్ డేటా సెంటర్ ఫ్యూచర్ సిటీలో ప్రముఖ పాత్ర పోషించనుంది

ఫ్యూచర్ సిటీలో 202 ఎకరాల్లో అమెజాన్ డేటా సెంటర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. 12 ఏళ్లలో 60 వేల కోట్ల రూపాయల పెట్టుబడితో ఈ కేంద్రం ఏర్పాటు కానుంది. ఆర్థిక వృద్ధిలో భాగంగా పరిశ్రమలకు అనుమతులు, పర్యావరణహిత రవాణా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సీఎం పేర్కొన్నారు. 202 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటుకు అమెజాన్ 12 ఏళ్లలో 60 వేల కోట్ల రూపాయలను పెట్టుబడిగా పెట్టనుంది. నగరంలో అమెజాన్ ఏర్పాటు చేస్తున్న రెండవ క్లౌడ్ రీజియన్ ఇది. చందనవెల్లిలో అదనంగా 98 ఎకరాలను అమెజాన్ సంస్థకు కేటాయించినట్లు  ప్రభుత్వం ప్రకటించింది.



ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యం

తెలంగాణ ఆర్థిక ప్రగతికి ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళికలు సిద్ధం చేసిందని ముఖ్యమంత్రి వెల్లడించారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఎకానమీని, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వృద్ధిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర జీడీపీలో 10 శాతం వాటా ఉండాలని భావిస్తున్నామని పేర్కొన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు సింగిల్ విండో అనుమతులు ఇస్తూ, పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు చెప్పారు. పెట్టుబడుల రాకను ప్రతి నెలా సమీక్షిస్తున్నట్లు ఆయన వివరించారు.

పర్యావరణ హితంగా హైదరాబాద్ నగర అభివృద్ధి

హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈవీ వాహనాల రిజిస్ట్రేషన్లపై జీరో ట్యాక్స్ అమలు చేస్తూ, ఆర్టీసీ బస్సులు, ఆటోలను విద్యుత్ వాహనాలుగా మారుస్తున్నట్లు ప్రకటించారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళన పనులను ప్రాధాన్యతతో చేస్తున్నట్లు వెల్లడించారు. పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలికి తరలించడం ద్వారా కాలుష్యాన్ని నియంత్రించేందుకు కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# 9వ తరగతిలో మూడో భాష ప్రవేశపెట్టడంపై సుప్రీంకోర్టు ఆందోళన

9వ తరగతిలో సీబీఎస్ఈ మూడో భాషను తప్పనిసరి చేయడంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. బోర్డు పరీక్షల సమయంలో కొత్త భాషను ప్రవేశపెట్టడం వల్ల విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి పెరుగుతుందని జస్టిస్ బి.వి. నాగరత్న ధర్మాసనం పేర్కొంది. తమిళనాడులో నవోదయ పాఠశాలల ఏర్పాటుపై దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసిన కోర్టు, కేంద్రం నిధులు ఇస్తున్నప్పుడు భూమి కేటాయించి పాఠశాలలు ఏర్పాటు చేయాలని సూచిస్తూ తదుపరి విచారణను ఆగస్టు 11కు వాయిదా వేసింది.

సీబీఎస్ఈ పాఠ్యాంశాల్లో భాగంగా 9వ తరగతిలో మూడో భాషను ప్రవేశపెట్టడంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. బోర్డు పరీక్షలకు సిద్ధమయ్యే కీలక దశలో విద్యార్థులపై కొత్త భాషను రుద్దడం వల్ల వారిపై అనవసర విద్యాపరమైన ఒత్తిడి పెరుగుతుందని అభిప్రాయపడింది. తమిళనాడులోని ప్రతి జిల్లాలో జవహర్ నవోదయ విద్యాలయాల (JNV) ఏర్పాటును వేగవంతం చేయాలంటూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ బి. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది.

చిన్న వయసులోనే నేర్పించాలి

నవోదయ పాఠశాలల్లో మూడు భాషల విధానాన్ని అమలు చేస్తుండటంపై తమిళనాడు ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఈ అంశంపై చర్చకు వచ్చింది. ఈ సందర్భంగా జస్టిస్ నాగరత్న నేతృత్వంలోని ధర్మాసనం కొన్ని కీలక పరిశీలనలు చేసింది. 9వ తరగతిలో కొత్త భాషను తీసుకురావద్దని, ఏదైనా మూడో భాషను నేర్పించాలనుకుంటే 5 లేదా 6వ తరగతిలోనే ప్రారంభించాలని, 9వ తరగతి నాటికి దానిని ముగించాలని ధర్మాసనం సూచించింది. విద్యార్థులు 8వ తరగతి ముగిసే సమయం నుండే 10వ తరగతి బోర్డు పరీక్షల కోసం సన్నద్ధమవుతారని, అలాంటి సమయంలో కొత్త భాషను ప్రవేశపెట్టడం వల్ల భారం పెరుగుతుందని పేర్కొంది. భాషా అభ్యాసం ఎంత త్వరగా ప్రారంభిస్తే అంత మంచిదని జడ్జి అభిప్రాయపడ్డారు. మూడు భాషల విధానంలో హిందీని ఖచ్చితంగా నేర్చుకోవాలని ఎక్కడా లేదని, రాష్ట్ర భాష, ఇంగ్లీషుతో పాటు ఏదైనా ఒక మూడో భాషను ఎంచుకోవచ్చని కోర్టు స్పష్టం చేసింది.

తమిళనాడులో నవోదయ పాఠశాలల ఏర్పాటు

రాష్ట్రంలో నవోదయ పాఠశాలల ఏర్పాటును తమిళనాడు ప్రభుత్వం నిరంతరం వ్యతిరేకించడంపై సుప్రీంకోర్టు ప్రశ్నించింది. కేంద్ర ప్రభుత్వం ఈ పాఠశాలల ఏర్పాటుకు పూర్తి నిధులు సమకూరుస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం కేవలం భూమిని మాత్రమే కేటాయించాల్సి ఉంటుందని గుర్తుచేసింది. కేంద్ర ప్రభుత్వ పథకం అనే కారణంతో తమిళనాడు విద్యార్థులను ఈ విద్యా అవకాశాలకు దూరం చేయడం సరికాదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుగుతున్నాయని, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడినందున వారి విధానాలపై స్పష్టత రావాల్సి ఉందని తమిళనాడు కౌన్సిల్ కోరడంతో, కోర్టు తదుపరి విచారణను ఆగస్టు 11వ తేదీకి వాయిదా వేసింది. కాగా, సీబీఎస్ఈ సవరించిన మూడు భాషల విధానం చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన ఇతర పిటిషన్లపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని వేరే బెంచ్ ఈనెల 29న విచారణ జరపనుంది.

## క్యాచ్ ది రైన్




నీటి సంరక్షణ, నిర్వహణతో పాటు, ముఖ్యంగా వర్షపు నీటిని సద్వినియోగం చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం జలశక్తి అభియాన్లో వర్షపునీరు ఒడిసిపట్టడం "క్యాచ్ ది రైన్" అనే కార్యక్రమాన్ని చేపట్టింది. దేశవ్యాప్తంగా అనేక జిల్లాలలో ఈ ప్రచారాన్ని నిర్వహిస్తోంది. ప్రజలు వర్షపు నీటిని సేకరించి, భవిష్యత్తులో ఉపయోగించుకునేలా ప్రోత్సహించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా వాతావరణ మార్పుల ద్వారా పెరుగుతున్న నీటి కొరత నేపథ్యంలో నీటి భద్రత, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుజ్జీవనం ప్రాముఖ్యతపై పలు అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

## ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థలకు సైబరాబాద్ కార్పొరేషన్ హెచ్చరిక

ఆహార నాణ్యతను కాపాడటానికి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆన్‌లైన్ డెలివరీ సంస్థలకు కఠిన నిబంధనలు జారీ చేసింది. లైసెన్స్ లేని హోటళ్లను తొలగించాలని, పారిశుద్ధ్యాన్ని పర్యవేక్షించాలని ఆదేశించింది. అలాగే కల్తీ ఆహారంపై ఉక్కుపాదం మోపుతూ 'హెచ్-ఫాస్ట్' బృందం ద్వారా పోలీసుల నిఘా కొనసాగుతోంది.

సైబరాబాద్ పరిధిలో ఆన్‌లైన్ ఆహార సరఫరా సంస్థలైన జొమాటో, స్విగ్గీలకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కఠిన నిబంధనలు జారీ చేసింది. సరైన చిరునామా, లైసెన్స్ లేని హోటళ్లను తమ ప్లాట్‌ఫామ్‌ల నుంచి తొలగించాలని కమిషనర్ జి.సృజన ఆదేశించారు. ఆహార నాణ్యతను కాపాడేందుకు సీఎంసీ నెల రోజులుగా చేపట్టిన తనిఖీల్లో భాగంగా, నాణ్యతా ప్రమాణాలు పాటించని హోటళ్లపై ఈ చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల కూకట్‌పల్లిలో ఒక హోటల్‌లో పారిశుద్ధ్య లోపాలు బయటపడటంతో, ఆ సంస్థను ఆన్‌లైన్ వేదిక నుంచి తొలగించారు.

పర్యవేక్షణ సంస్థల బాధ్యతే

జీహెచ్ఎంసీ, ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ ఉన్న హోటళ్లను మాత్రమే ఆన్‌లైన్‌లో ఉంచాలని కమిషనర్ సూచించారు. హోటల్, క్లౌడ్ కిచెన్లకు సంబంధించి స్పష్టమైన చిరునామా, గూగుల్ లొకేషన్ తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. కార్పొరేషన్ ఇచ్చే రేటింగ్‌ను బట్టి చర్యలు తీసుకోవాలని, దీనికోసం ప్రత్యేక నోడల్ అధికారిని నియమించాలని సంస్థలకు ఆదేశాలు జారీ చేశారు. వారం రోజుల్లోగా తమ వద్ద నమోదైన హోటళ్ల జాబితాతో పాటు నివేదికను సమర్పించాలని స్పష్టం చేశారు.

# ఆయుర్వేద, ఆధునిక వైద్య పద్ధతుల అనుసంధానం ముఖ్యం-రాష్ట్రపతి

దిల్లీలో మూడు రోజుల పాటు జరిగే 'సుశ్రుతం 2026' అంతర్జాతీయ సదస్సును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. ఆయుర్వేదం, ఆధునిక వైద్య పద్ధతుల మేళవింపుపై నిపుణులు చర్చించనున్నారు. ఆయుర్వేద మహిళా గ్రాడ్యుయేట్ల పురోగతిపై రూపొందించిన ప్రత్యేక నివేదికను రాష్ట్రపతి ఈ సందర్భంగా విడుదల చేశారు.




దిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేదంలో మూడు రోజుల పాటు కొనసాగే 'సుశ్రుతం 2026' అంతర్జాతీయ సదస్సును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. ఆయుర్వేదం ఆధునిక శస్త్రచికిత్స పద్ధతుల అనుసంధానంపై ఈ సదస్సులో కీలకచర్చలు జరగనున్నాయి. వైద్య రంగంలో ప్రాచీన, ఆధునిక పద్ధతుల మేళవింపు ఎలా ఉండాలో నిపుణులు తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు.

మహిళా గ్రాడ్యుయేట్ల నివేదిక విడుదల

ఈ కార్యక్రమంలో నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్ ఆధ్వర్యంలో రూపొందించిన జాతీయ అధ్యయన నివేదికను రాష్ట్రపతి విడుదల చేశారు. ఆయుర్వేద మహిళా గ్రాడ్యుయేట్ల కెరీర్ పురోగతిపై ఈ నివేదిక సమగ్ర సమాచారాన్ని అందిస్తుంది. ఆయుర్వేద వైద్య రంగంలో మహిళల భాగస్వామ్యం, వారికి అందుబాటులో ఉన్న వృత్తిపరమైన అవకాశాలను ఈ అధ్యయనం విశ్లేషించింది.

వైద్య రంగంలో కొత్త దిశానిర్దేశం

ఆయుర్వేద శస్త్రచికిత్స పద్ధతులను ఆధునిక వైద్యంతో సమన్వయం చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని సదస్సు ఉద్దేశ్యం. దేశవ్యాప్తంగా ఉన్న ఆయుర్వేద నిపుణులు, శాస్త్రవేత్తలు పాల్గొంటున్న ఈ సదస్సు వైద్య రంగంలో కొత్త మార్పులకు బాటలు వేయనుంది. నిరంతరం మారుతున్న వైద్య అవసరాలకు అనుగుణంగా ప్రాచీన విజ్ఞానాన్ని శాస్త్రీయంగా ఎలా వినియోగించుకోవాలనే అంశంపై ఈ సదస్సులో సమగ్రంగా చర్చిస్తారు.

# ఈనెల 20 నుంచి కొచ్చిలో అంతర్జాతీయ నావికాదళ శిక్షణ 'ఆపరేషన్ సదరన్ రెడీనెస్ 26-2'




కేరళలోని కొచ్చి సదరన్ నావల్ కమాండ్‌లో ఈ నెల 20 నుండి 23 వరకు 'ఆపరేషన్ సదరన్ రెడీనెస్ 26-2' ఉమ్మడ నావికాదళ శిక్షణా కార్యక్రమం జరగనుంది. భారత నావికాదళ నేతృత్వంలోని కంబైన్డ్ టాస్క్ ఫోర్స్ 154, సీఎమ్ఎఫ్ భాగస్వామ్యంతో జరిగే ఈ ఉమ్మడి శిక్షణలో సముద్ర చట్టాలు, మాదకద్రవ్యాల నిరోధం, అగ్నిమాపక చర్యలు, యుద్ధనౌకలపై ప్రత్యక్ష ప్రాక్టికల్స్ నిర్వహిస్తారు. ఈ కార్యక్రమం ద్వారా అంతర్జాతీయ శిక్షణా రంగంలో భారత నావికాదళ సామర్థ్యం మరింత విస్తరించనుందని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది.

భారత నౌకాదళం ఆధ్వర్యంలో ఈ నెల 20 నుండి 23వ తేదీ వరకు కొచ్చిలోని సదరన్ నావల్ కమాండ్‌లో ప్రతిష్ఠాత్మక 'ఆపరేషన్ సదరన్ రెడీనెస్ 26-2' ఉమ్మడి శిక్షణా కార్యక్రమం జరగనుంది. ఈ నాలుగు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని కంబైన్డ్ మారిటైమ్ ఫోర్సెస్ భాగస్వామ్యంతో, భారత నావికాదళం నేతృత్వంలోని కంబైన్డ్ టాస్క్ ఫోర్స్ 154 ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు రక్షణ శాఖ వెల్లడించింది. ఈ శిక్షణలో క్లాస్‌రూమ్ బోధన, సిమ్యులేటర్ ఆధారిత శిక్షణ, క్షేత్రస్థాయి ప్రాక్టికల్ విజ్ఞానాన్ని సమిష్టిగా అందించనున్నారు.

శిక్షణలోని ప్రధానాంశాలు

ఈ బహుళజాతి శిక్షణా కార్యక్రమంలో భాగంగా అంతర్జాతీయ నావికాదళ సిబ్బందికి పలు కీలక రంగాలపై అవగాహన కల్పిస్తారు. సముద్ర చట్టాలు, సముద్ర పరిధిపై అవగాహన, మాదకద్రవ్యాల అక్రమ రవాణా నిరోధం, నౌకాదళ రక్షణ, మానవరహిత సముద్ర వ్యవస్థల నిర్వహణపై ప్రత్యేక సెషన్లు ఉంటాయి. నౌక దెబ్బతిన్నప్పుడు నియంత్రించడం, అగ్నిమాపక చర్యలు, సముద్ర కమ్యూనికేషన్స్, సముద్రంలో ప్రాణరక్షణ పద్ధతులు, భారత నావికాదళ యుద్ధనౌకలపై ప్రత్యక్ష శిక్షణ ఇవ్వనున్నారు.

గ్లోబల్ ట్రైనింగ్ హబ్‌గా కొచ్చి

కొచ్చిలోని సదరన్ నావల్ కమాండ్‌లో ఈ అంతర్జాతీయ కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా బహుళజాతి సముద్ర శిక్షణ రంగంలో భారత నావికాదళానికి పెరుగుతున్న ప్రాధాన్యతను చాటిచెప్పినట్లవుతుందని రక్షణ శాఖ పేర్కొంది. అంతర్జాతీయ నావికాదళాల వృత్తిపరమైన శిక్షణకు కొచ్చి ఒక ప్రముఖ హబ్‌గా రూపాంతరం చెందుతోందని స్పష్టం చేసింది. భారత నావికాదళానికి చెందిన అత్యాధునిక మౌలిక వసతులు, అడ్వాన్స్డ్ సిమ్యులేటర్లు, నిపుణుల నైపుణ్యాన్ని ఈ ఆపరేషన్ ప్రదర్శించనుంది. థియరీతో పాటు ప్రాక్టికల్ విధానాన్ని జోడించి ఇచ్చే ఈ శిక్షణ ద్వారా పాల్గొనే వివిధ దేశాల నావికాదళాల మధ్య పరస్పర సహకారం, సమన్వయం, వృత్తిపరమైన అవగాహన మరింత పటిష్టం కానున్నాయి.

## ఉడాన్ తదుపరి దశతో 120 కొత్త గమ్యస్థానాలకు విమాన సేవలు: కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



న్యూఢిల్లీలో జరిగిన ఉడాన్ వర్క్‌షాప్‌లో పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మాట్లాడారు. ఉడాన్ తదుపరి దశ కోసం రూ.29 వేల కోట్లు కేటాయించినట్లు, దీని ద్వారా 120 కొత్త గమ్యస్థానాలకు విమాన సేవలు విస్తరిస్తామని తెలిపారు. రాబోయే దశాబ్దంలో మరో 100 విమానాశ్రయాలు, 200 హెలిపోర్టులు నిర్మించి 4 కోట్ల మందికి విమాన ప్రయాణ సౌకర్యం కల్పించడమే లక్ష్యమని, విమానయాన సంస్థలకు ఇచ్చే ఆర్థిక మద్దతును 5 ఏళ్లకు పొడిగించామని పేర్కొన్నారు.

ఉడాన్ పథకం తదుపరి దశ ద్వారా దేశంలో మరో 120 కొత్త గమ్యస్థానాలకు విమాన అనుసంధానాన్ని మెరుగుపరచడమే కాకుండా, రాబోయే 10 ఏళ్లలో నాలుగు కోట్ల మంది ప్రయాణికులు విమానయానం చేసేలా వీలు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. న్యూఢిల్లీలో ఉడాన్ తదుపరి దశపై జరిగిన ఒక వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. ఈ నూతన పథకం వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ పరిధిని విస్తరిస్తుందని చెప్పారు. ఇందులో భాగంగా విమానయాన సంస్థలకు ఇచ్చే మద్దతును మూడు సంవత్సరాల నుండి ఐదు సంవత్సరాలకు పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. ఎంపిక చేసిన టైర్-2, టైర్-3 విమానాశ్రయాలకు కార్యాచరణ, నిర్వహణ మద్దతును సైతం ప్రవేశపెడుతున్నట్లు వివరించారు.

రూ.29 వేల కోట్లతో మౌలిక వసతుల విస్తరణ

వచ్చే దశాబ్ద కాలంలో దేశవ్యాప్తంగా విమానయాన రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం భారీ ప్రణాళికలను సిద్ధం చేసినట్లు మంత్రి వెల్లడించారు. రాబోయే పదేళ్లలో దేశంలో మరో 100 విమానాశ్రయాలు, 200 హెలిపోర్టులను కొత్తగా అభివృద్ధి చేయనున్నారు. ఈ తదుపరి దశ మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం రూ.29 వేల కోట్ల భారీ కేటాయింపును ఏర్పాటు చేసింది.

ఆత్మనిర్భర్ భారత్‌కు ఊతం

స్వదేశీ విమాన తయారీ రంగానికి మద్దతు ఇవ్వడం, విమానాల నిర్వహణ, మరమ్మత్తు, ఓవర్‌హాల్ వ్యవస్థను దేశీయంగా బలోపేతం చేయడం ద్వారా ఉడాన్ తదుపరి దశ 'ఆత్మనిర్భర్ భారత్' ఉద్దేశ్యాలను మరింత ముందుకు తీసుకెళ్తుందని రామ్ మోహన్ నాయుడు స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుల ద్వారా దేశంలో భారీగా ఉపాధి కల్పన జరగడమే కాకుండా ప్రాంతీయ ఆర్థిక వృద్ధి గణనీయంగా పెరుగుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఐరాస భద్రతా మండలి తాత్కాలిక సభ్యత్వానికి భారత్ ప్రచారం ప్రారంభం

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో 2028-29 కాలానికి తాత్కాలిక సభ్యత్వం కోసం భారత్ ప్రచారాన్ని ప్రారంభించింది. న్యూయార్క్‌లోని ఐరాస ప్రధాన కార్యాలయంలో విదేశాంగ మంత్రి జైశంకర్ భారత్ అభ్యర్థిత్వాన్ని ప్రకటిస్తూ.. ప్రపంచ శాంతి కోసం భారత్ ప్రతిపాదిస్తున్న సరికొత్త విజన్‌ను వివరించారు. సభ్య దేశాలన్నీ భారత్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. అనంతరం ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్‌తో భేటీ అయి తాజా ప్రపంచ పరిణామాలపై చర్చించారు.



ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో 2028-29 కాలవ్యవధికి గానూ, తాత్కాలిక సభ్య దేశంగా ఎన్నికయ్యేందుకు భారత్ తన ప్రచారాన్ని ప్రారంభించింది. అమెరికాలోని న్యూయార్క్‌లో గల ఐరాస ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ పాల్గొని, భారత్ అభ్యర్థిత్వాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా మంత్రి జైశంకర్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, భౌగోళిక రాజకీయ తీవ్ర అస్థిరతలు పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో ఐక్యరాజ్యసమితితో పాటు భద్రతా మండలి పాత్ర మునుపటి కంటే ఎంతో కీలకమని పేర్కొన్నారు.

## భారత్ సరికొత్త శాంతి విజన్ ఆవిష్కరణ

అంతర్జాతీయ సుపరిపాలన, సమకాలీన సవాళ్ల పరిష్కారం కోసం భారతదేశం ప్రతిపాదిస్తున్న సరికొత్త శాంతి విజన్‌ను ఈ వేదికపై జైశంకర్ ప్రపంచ దేశాల ముందు ఆవిష్కరించారు. మరింత సురక్షితమైన, శాంతియుతమైన, సమ్మిళిత ప్రపంచ నిర్మాణం కోసం భారత్ నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. ఐరాసలోని సభ్య దేశాలన్నీ భారతదేశానికి ఉన్న సుదీర్ఘ ప్రజాస్వామ్య చరిత్ర, విశ్వసనీయతను గుర్తించి భద్రతా మండలి ఎన్నికల్లో భారత్ అభ్యర్థిత్వానికి ఏకగ్రీవంగా మద్దతు పలకాలని పిలుపునిచ్చారు.

## ఐరాస సెక్రటరీ జనరల్‌తో భేటీ

న్యూయార్క్ పర్యటనలో భాగంగా విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్.. ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీలో ప్రస్తుత ప్రపంచ రాజకీయ పరిణామాలు, వివిధ ప్రాంతాల్లో నెలకొన్న ఉద్రిక్తతలు, ఐరాస సంస్కరణలపై వారు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశానికి సంబంధించిన వివరాలను మంత్రి జైశంకర్ ఎక్స్ వేదికగా షేర్ చేశారు.

# కార్పొరేట్ యావరేజ్ ఫ్యూయల్ ఎకానమీ 2027 ముసాయిదా నిబంధనలు విడుదల

**కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ CAFE 2027 ముసాయిదా నిబంధనలను విడుదల చేసింది. ఈ ప్రతిపాదిత ఇంధన సామర్థ్య నియమాలు 2027-28 నుండి 2031-32 వరకు దేశంలో తయారయ్యే, దిగుమతి అయ్యే 'M1 కేటగిరీ ప్యాసింజర్ వాహనాలకు వర్తిస్తాయి. ఈ ముసాయిదాపై సలహాలు, సూచనలు సమర్పించడానికి వచ్చే నెల 6వ తేదీ వరకు గడువు ఇచ్చారు.**

దేశంలో ఇంధన సామర్థ్యాన్ని పెంపొందించడం, కాలుష్య ఉద్గారాలను తగ్గించడం లక్ష్యంగా కేంద్ర విద్యుత్ శాఖ మరో ముందడుగు వేసింది. ఇందులో భాగంగా కార్పొరేట్ యావరేజ్ ఫ్యూయల్ ఎకానమీ (CAFE 2027) ముసాయిదా నిబంధనలను విడుదల చేసింది. ఈ నిబంధనలు 2027-28 ఆర్థిక సంవత్సరం నుండి 2031-32 ఆర్థిక సంవత్సరం వరకు అమలులో ఉంటాయి. ఈ సమయంలో దేశంలో తయారుచేసే లేదా విక్రయాల కోసం విదేశాల నుండి దిగుమతి చేసుకునే వాహనాలకు ఇవి వర్తిస్తాయి.

**ఎం1 కేటగిరీ వాహనాలకే వర్తింపు**

నూతన 'CAFE 2027' నిబంధనలను నిర్దిష్ట వాహన విభాగానికి మాత్రమే పరిమితం చేశారు. ఈ ప్రతిపాదనలు కేవలం 'M1 కేటగిరీ' ప్యాసింజర్ వాహనాలకు మాత్రమే వర్తిస్తాయి. డ్రైవర్ సీటుతో పాటు గరిష్టంగా ఎనిమిది మంది ప్రయాణీకులు కూర్చునే సామర్థ్యం కలిగి, ప్రయాణికుల రవాణా కోసం ప్రత్యేకంగా రూపొందించిన మోటారు వాహనాలను ఎం1 కేటగిరీగా పరిగణిస్తారు.

**వచ్చే నెల 6 లోగా స్పందనల ఆహ్వానం**

ఈ ముసాయిదా నిబంధనలపై వివిధ భాగస్వామ్య పక్షాలు, వాహన ఉత్పాదక రంగానికి చెందిన నిపుణులు, అలాగే సాధారణ ప్రజల నుండి కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ సూచనలు, సలహాలు, ఫీడ్‌బ్యాక్‌ను ఆహ్వానించింది. ఆసక్తి ఉన్నవారు తమ అభిప్రాయాలను సమర్పించడానికి వచ్చే నెల 6వ తేదీ వరకు గడువు విధించింది. ఈ గడువు ముగిసిన అనంతరం వచ్చే స్పందనలను పరిశీలించి తుది నిబంధనలను ఖరారు చేయనున్నారు

# కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో పాలాభిషేకాలు, జేసీబీ దండలపై టీపీసీసీ నిషేధం



కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలలో పాలాభిషేకాలు, జలాభిషేకాలు, జేసీబీలతో భారీ దండలు వేయడాన్ని టీపీసీసీ నిషేధించింది. ఏఐసీసీ రాష్ట్ర ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ఆదేశాల మేరకు పార్టీ ఉపాధ్యక్షుడు టి. కుమార్ రావు ఈ సర్క్యులర్ జారీ చేశారు. పాలు వృథా చేయకుండా పేదలకు ఆహారం పంచాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే క్రమశిక్షణా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

కాంగ్రెస్ పార్టీ అధికారిక కార్యక్రమాలలో నేతల కటౌట్లకు పాలాభిషేకాలు, జలాభిషేకాలు చేయడం, జేసీబీలతో భారీ దండలు వేయడం వంటి హంగామా పద్ధతులపై తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (TPCC) నిషేధం విధించింది. ఏఐసీసీ తెలంగాణ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వెల్లడించింది. ఈ మేరకు టీపీసీసీ ఉపాధ్యక్షుడు టి. కుమార్ రావు ఒక అధికారిక సర్క్యులర్ జారీ చేశారు. ఈ నూతన నిబంధనల ప్రకారం పార్టీ శ్రేణులు కొన్ని పద్ధతులకు దూరంగా ఉండాలని స్పష్టం చేశారు.

సర్క్యులర్ లోని ప్రధానాంశాలు

కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏ కార్యక్రమంలోనూ నాయకుల చిత్రపటాలకు లేదా కటౌట్లకు పాలాభిషేకాలు, జలాభిషేకాలు నిర్వహించరాదు. పాలాభిషేకాలు వంటి చర్యలు ఆహార వృథాకు దారితీస్తాయని పార్టీ పేర్కొంది. అలాంటి వృథా పద్ధతులకు బదులుగా, ఆ ఖర్చుతో పేదలకు, అవసరమైన వారికి ఆహార పంపిణీ కార్యక్రమాలు చేపట్టాలని శ్రేణులకు సూచించింది. జేసీబీలు, బుల్డోజర్లు వంటి భారీ క్రేన్ యంత్రాలను ఉపయోగించి నేతలకు భారీ దండలు వేసే సంస్కృతిని కూడా పూర్తిగా నిషేధించారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన నాయకులు, కార్యకర్తలపై పార్టీ పరంగా కఠిన క్రమశిక్షణా చర్యలు ఉంటాయని టీపీసీసీ ఉపాధ్యక్షుడు టి. కుమార్ రావు సర్క్యులర్‌లో హెచ్చరించారు.

# ఎస్. జానకి స్మృత్యంజలి కార్యక్రమం

తెలుగువారు గర్వించదగ్గ గాయకురాలు ఎస్. జానకి అని ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక సమితి, భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన ఎస్. జానకి స్మృత్యంజలి కార్యక్రమం, వందేమాతరం గీతం 150 సంవత్సరాల వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్. జానకి 17 భాషల్లో వేలాది పాటలు పాడి భారతీయ సంగీత రంగంలో చెరగని ముద్ర వేశారని పేర్కొన్నారు. అలాగే వందేమాతరం గీతం దేశభక్తికి ప్రతీకగా నిలిచిందని, యువతలో జాతీయ భావన పెంపొందించే కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించవలసిన అవసరం ఉందని తెలిపారు.

## ఇరాన్-అమెరికా మధ్య కొనసాగుతున్న దాడులు

హార్ముజ్ జలసంధిలో ఇరాన్ సైనిక స్థావరాలపై అమెరికా వైమానిక దాడులు నిర్వహించగా, ఇరాన్ సైన్యం బహ్రెయిన్, జోర్డాన్లలోని అమెరికా మిలిటరీ బేస్‌లపై క్షిపణులు, డ్రోన్లతో ప్రతికార దాడులు చేపట్టింది. జోర్డాన్‌లోని అల్-అజ్రాక్ బేస్, బహ్రెయిన్‌లోని అమెరికా 5వ నావికాదళ నియంత్రణ కేంద్రాలలోని ఫైటర్ జెట్ల షెల్టర్లు, ఇంధన నిల్వలను ధ్వంసం చేసినట్లు ఇరాన్ ప్రకటించింది. జలసంధిలో నౌకల రాకపోకల నియంత్రణ, దిగ్బంధనం అంశంపై ఈ ఇరు దేశాల మధ్య ఘర్షణ నెలకొంది.



హార్ముజ్ జలసంధి గుండా వెళ్లే నౌకలకు నిరోధకంగా మారిన ఇరాన్ సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని అమెరికా సైన్యం రెండో విడత వైమానిక దాడులు ప్రారంభించినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ తెలిపింది. అంతకుముందు బుధవారం గ్రేటర్ తుంబ్ ద్వీపంలోని తీరప్రాంత రక్షణ వ్యవస్థలు, క్రూయిజ్ క్షిపణి నిల్వ కేంద్రాలపై అమెరికా దాడులు చేసింది.



ఈ చర్యకు ప్రతికారంగా బహ్రెయిన్, జోర్డాన్లలోని అమెరికా సైనిక స్థావరాలపై దాడులు చేసినట్లు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ ప్రకటించింది. జోర్డాన్ లోని అల్-అజ్రాక్ బేస్‌పై జరిపిన దాడిలో అమెరికాకు చెందిన ఎఫ్-15, ఎఫ్-16, ఎఫ్-35 ఫైటర్ జెట్లు, డ్రోన్ల షెల్టర్లను ధ్వంసం చేసినట్లు పేర్కొంది. బహ్రెయిన్‌లోని అమెరికా ఐదో నావికాదళ కమాండ్ నియంత్రణ కేంద్రం, ఇంధన నిల్వ కేంద్రాలపై ఇరాన్ నౌకాదళం దాడులు జరిపింది. హార్ముజ్ జలసంధిలో అమెరికా నౌకాదళ దిగ్బంధనాన్ని పునఃప్రారంభించిన నేపథ్యంలో ఇరు దేశాల మధ్య దాడులు కొనసాగుతున్నాయి.

# దక్షిణ చైనా సముద్ర వివాదం, హర్మూజ్ జలసంధి దాడులపై విదేశాంగ శాఖ కీలక ప్రకటన

దక్షిణ చైనా సముద్ర వివాదం, హర్మూజ్ జలసంధి దాడులపై భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందించారు. దక్షిణ చైనా సముద్ర వివాదాన్ని అన్‌క్లాస్ చట్టాల ప్రకారం శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నారు. అలాగే హార్మూజ్ జలసంధిలో భారత నావికుడి మృతికి కారణమైన దాడులను ఖండిస్తూ ఇరాన్ ఉప దౌత్యవేత్తకు సమన్లు జారీ చేసి నిరసన తెలిపామని వెల్లడించారు. ప్రపంచ దేశాల ఆర్థిక, ఇంధన భద్రత దృష్ట్యా హర్మూజ్ జలసంధిలో స్వేచ్ఛాయుత నౌకాయానం అత్యంత కీలకమని భారత్ స్పష్టం చేసింది.

దక్షిణ చైనా సముద్ర వివాదంతో పాటు హార్మూజ్ జలసంధిలో యూఏఈ ట్యాంకర్లపై ఇరాన్ జరిపిన దాడుల అంశంపై విదేశాంగ శాఖ కీలక ప్రకటన చేసింది. దక్షిణ చైనా సముద్ర వివాదంపై భారత్ వైఖరిని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధిరణధీర్ జైస్వాల్ పునరుద్ఘాటించారు. అంతర్జాతీయ చట్టాలకు, ముఖ్యంగా 'అన్‌క్లాస్' (UNCLOS - ఐక్యరాజ్యసమితి సముద్ర చట్టాల కన్వెన్షన్) నిబంధనలకు లోబడి అంతర్జాతీయ జలాల్లో స్వేచ్ఛాయుత నౌకాయానం, విమాన ప్రయాణాలు, నిరంతరాయ వాణిజ్యం జరగడం ఆవశ్యకమని పేర్కొన్నారు. సరిహద్దు సముద్ర వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించారు. 10 ఏళ్ల క్రితం అంతర్జాతీయ ఆర్బిట్రల్ ట్రిబ్యునల్ ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు ఈ వివాదాల శాంతియుత పరిష్కారానికి ఒక మైలురాయి అని స్పష్టం చేశారు.

ఇరాన్ దాడులపై భారత్ నిరసన

హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై జరిగిన క్షిపణి దాడులపై స్పందించారు. ఢిల్లీలోని ఇరాన్ ఉప దౌత్యవేత్తను పిలిపించి సమన్లు జారీ చేసిన అనంతరం విదేశాంగ శాఖ అధికారిక ప్రకటన విడుదల చేసిందని తెలిపారు. ఈ దాడుల్లో ఒక భారతీయ నావికుడు ప్రాణాలు కోల్పోవడం, మరికొంతమంది భారతీయులు గాయపడటంపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఈ ఘటనను ఖండించారు. ఇరాన్ వైఖరిపై భారత్ తన బలమైన నిరసనను తెలియజేసిందని, ఇటువంటి దాడులను తక్షణమే ఆపివేయాలని స్పష్టం చేసినట్లు చెప్పారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించి, ఇరుపక్షాలు చర్చల వేదికపైకి రావాలని కోరారు. దౌత్యపరమైన సంప్రదింపుల ద్వారానే ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వాన్ని పునరుద్ధరించడం సాధ్యమవుతుందని టెహ్రాన్‌కు సూచించామన్నారు.

అమెరికా ప్రకటన - ఆర్థిక భద్రతకు హార్మూజ్ కీలకం


ఈ ఉద్రిక్తతలపై అమెరికా ఇచ్చిన ప్రకటనపై స్పందిస్తూ.. పశ్చిమాసియాలో మారుతున్న పరిణామాలను భారత్ నిశితంగా గమనిస్తోందని రణధీర్ జైస్వాల్ తెలిపారు. హర్మూజ్ జలసంధి గుండా సురక్షితమైన, నిరంతరాయమైన నౌకాయానం మరియు ఉచిత వాణిజ్య ప్రవాహం సాగాలని భారతదేశం నిరంతరం ఆకాంక్షిస్తోందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజల ఆర్థిక మరియు ఇంధన భద్రతను (Energy Security) కాపాడటానికి హర్మూజ్ జలమార్గం సురక్షితంగా ఉండటం అత్యంత కీలకమని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.

# టీఎంసీకి మరో గట్టి ఎదురుదెబ్బ.. రాజ్యసభ సభ్యత్వానికి కోయల్ మల్లిక్ రాజీనామా

తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన రాజ్యసభ ఎంపీ కోయల్ మల్లిక్ తన పదవికి రాజీనామా చేశారు. రాజ్యసభ చైర్మన్ సి.పి. రాధాకృష్ణన్‌ను కలిసి రాజీనామా పత్రం అందించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే ఎన్నికైన ఆమె, వ్యక్తిగత కారణాలు వెల్లడించకుండానే తప్పుకున్నారు. గతంలో సుఖేందు శేఖర్ రాయ్, సుస్మితా దేవ్, ప్రకాష్ చిక్ బరాఇక్‌లు రాజీనామా చేసి బీజేపీలో చేరగా, కోయల్ నాలుగో ఎంపీగా నిలిచారు.



పశ్చిమ బెంగాల్‌లోని తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన ప్రముఖ రాజ్యసభ సభ్యురాలు కోయల్ మల్లిక్ తన పదవికి రాజీనామా చేశారు. ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ సి.పి. రాధాకృష్ణన్‌ను కలిసి తన రాజీనామా పత్రాన్ని సమర్పించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే ఆమె టీఎంసీ తరఫున ఎగువ సభకు ఎన్నికయ్యారు. పదవి చేపట్టిన నాలుగు నెలల కాలంలోనే ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారు. కాగా, రాజీనామాకు గల ఖచ్చితమైన కారణాలను కోయల్ మల్లిక్ ఇప్పటివరకు అధికారికంగా వెల్లడించలేదు.



తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నుండి రాజ్యసభ పదవికి రాజీనామా చేసిన నాలుగో ఎంపీగా కోయల్ మల్లిక్ నిలిచారు. అంతకు ముందు సుఖేందు శేఖర్ రాయ్, సుస్మితా దేవ్, ప్రకాష్ చిక్ బరాఇక్ లు తమ రాజ్యసభ స్థానాలకు రాజీనామా చేశారు. తర్వాత వీరంతా బీజేపీలో చేరారు. కోయల్ మల్లిక్ తాజా రాజీనామా నిర్ణయంతో రాజ్యసభలో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ సంఖ్యాబలం ఇప్పుడు 9 స్థానాలకు పడిపోయింది.

# గోల్కొండ జగదాంబిక అమ్మవారికి తొలి బోనం.. వైభవంగా ప్రారంభమైన ఆషాడ బోనాల ఉత్సవాలు

గోల్కొండ కోట జగదాంబిక అమ్మవారికి తొలి బోనం సమర్పణతో ఆషాడ బోనాల ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి, ఆలయ కమిటీకి రూ. 11 లక్షల ప్రభుత్వ సహాయం చెక్కును అందజేశారు. రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం తగ్గి సమృద్ధిగా వర్షాలు కురవాలని, సంక్షేమ పాలన అందాలని ఆకాంక్షించినట్లు మంత్రి సురేఖ తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకల ఏర్పాట్లు చేసినట్లు దేవాదాయ శాఖ పేర్కొంది.

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాడ బోనాల ఉత్సవాలు గోల్కొండ కోట జగదాంబిక అమ్మవారికి తొలి బోనం సమర్పణతో అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. డప్పు చప్పుళ్లు, పోతురాజుల విన్యాసాలు, కళాకారుల జానపద ప్రదర్శనలు, శివసత్తుల పూనకాల నడుమ హైదరాబాద్ నగరంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. బోనాల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని లంగర్ హౌజ్ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఉత్సవ వేదిక వద్దకు చేరుకున్న మంత్రులకు అర్చకులు వేద మంత్రోచ్చారణలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు.



### అమ్మవారికి పట్టువస్త్రాలు, రూ.11 లక్షల చెక్కు సమర్పణ

మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ కలిసి ప్రభుత్వం తరపున గోల్కొండ జగదాంబిక అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ ఈరగోలను చేతిలో ధరించి వారిని ఉత్సాహపరిచారు. అనంతరం జగదాంబిక ఆలయ కమిటీకి ప్రభుత్వం తరపున రూ.11 లక్షల ఆర్థిక సహాయం చెక్కును మంత్రులు అందజేశారు. సాంస్కృతిక శాఖ ప్రత్యేకంగా రూపొందించిన 'ఆషాడ బోనాల ఉత్సవాల బుక్‌లెట్'ను ఆవిష్కరించారు. పెద్ద ఆలయాలతో పాటు గల్లీలలో ఉండే చిన్న చిన్న దేవాలయాల అభివృద్ధికి కూడా ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందని దేవాదాయ శాఖ స్పష్టం చేసింది.

### వర్షాలు సమృద్ధిగా కురవాలి

మంత్రి కొండా సురేఖ రాష్ట్ర ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ.. గోల్కొండ అమ్మవారి దయతో ఎల్ నినో ప్రభావం తగ్గి, భూతల్లి శాంతించి రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ప్రథమ ఎజెండాగా పనిచేస్తోందని చెప్పారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకల ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

# రిటైర్మెంట్ ఆలోచనే లేదు.. స్పష్టం చేసిన రోహిత్ శర్మ

తన రిటైర్మెంట్‌పై వస్తున్న వార్తలను భారత క్రికెటర్ రోహిత్ శర్మ కొట్టిపారేశాడు. ఆటపైనే తన పూర్తి దృష్టి ఉంటుందని స్పష్టం చేశాడు. విరాట్ కోహ్లీతో కలిసి బ్యాటింగ్ చేయడాన్ని ఆస్వాదిస్తానని తెలిపాడు. ఇంగ్లాండ్‌తో మూడో వన్డేలో ఓటమి నిరాశపరిచిందని పేర్కొన్నాడు.




తన రిటైర్మెంట్‌పై జరుగుతున్న ప్రచారాన్ని భారత స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ ఖండించాడు. తన మనసులో ఆ ఆలోచనే లేదని స్పష్టం చేశాడు. ఇంగ్లాండ్‌తో లార్డ్స్‌లో జరిగిన మూడో వన్డేలో రోహిత్ సెంచరీ సాధించాడు. అయితే అంతకుముందు ఆడిన కొన్ని మ్యాచ్‌ల్లో ఆశించిన మేర పరుగులు చేయకపోవడంతో అతడు రిటైర్మెంట్ ప్రకటిస్తాడంటూ వార్తలు వచ్చాయి. సిరీస్ ముగిసిన తర్వాత బీసీసీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో రోహిత్ ఈ వదంతులకు ముగింపు పలికాడు. దేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ బ్యాట్‌తో రాణించడమే తన ప్రధాన బాధ్యత అని, అరంగేట్రం చేసినప్పటి నుంచి అదే పాటిస్తున్నానని తెలిపాడు. తాను ఆడుతున్నంత కాలం ఇలాంటి ప్రచారం జరుగుతూనే ఉంటుందని, వాటిని పెద్దగా పట్టించుకోనని పేర్కొన్నాడు.

**కోహ్లీతో బ్యాటింగ్ ఎప్పుడూ సరదాగే**

లార్డ్స్ వన్డే రోహిత్, విరాట్ కోహ్లీ కలిసి ఆడిన 400వ అంతర్జాతీయ మ్యాచ్ కావడం విశేషం. ఈ మ్యాచ్‌లో వీరిద్దరూ రెండో వికెట్‌కు 113 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. వన్డేల్లో వీరి మధ్య ఇది 21వ శతక భాగస్వామ్యం. కోహ్లీతో కలిసి బ్యాటింగ్ చేయడంపై రోహిత్ స్పందిస్తూ.. కెరీర్ ఆసాంతం కలిసి ఆడామని, మైదానంలో అతడితో ఉండటం చాలా బాగుంటుందని చెప్పాడు. తాము ఒకరినొకరం బాగా అర్థం చేసుకుంటామని, జట్టు కోసం ఏం చేయాలనే దానిపై ఎప్పటికప్పుడు చర్చించుకుంటామని వివరించాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన మూడో వన్డేలో జట్టు గెలుపు కోసం చివరి వరకు పోరాడామని, 27 పరుగుల తేడాతో ఓడిపోవడం కాస్త నిరాశ కలిగించిందని రోహిత్ అన్నాడు

మోల్డోవాలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన

# మోల్డోవాలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన



మోల్డోవాలో పర్యటిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆ దేశ అధ్యక్షుడు మయా సాందూతో చర్చలు జరిపారు. వాణిజ్యం, సాంకేతికత, డిజిటల్ రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించాలని ఇరు దేశాలు అంగీకరించాయి. భారత రాష్ట్రపతి మోల్డోవాలో పర్యటించడం ఇదే ప్రథమం కావడం విశేషం. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, మోల్డోవా అధ్యక్షుడు మయా సాందూతో సమావేశమై వాణిజ్యం, పెట్టుబడులు, వ్యవసాయం, వైద్యం, పునరుత్పాదక ఇంధన వనరులు, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కృత్రిమ మేధస్సు వంటి పలు రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి అంగీకరించారు. మోల్డోవా రాజధాని చిసినౌలో ప్రతినిధి స్థాయి చర్చల అనంతరం జరిగిన సంయుక్త విలేకరుల సమావేశంలో రాష్ట్రపతి ముర్ము మాట్లాడుతూ, భారత రాష్ట్రపతి హోదాలో రిపబ్లిక్ ఆఫ్ మోల్డోవాలో పర్యటించడం ఇదే తొలిసారని, ఇది ఒక చారిత్రక మైలురాయి అని అభివర్ణించారు. గత మూడు దశాబ్దాలుగా ఇరు దేశాల మధ్య ఉన్న సత్సంబంధాలు, పరస్పర నమ్మకం ఈ పర్యటన ద్వారా మరింత ప్రతిబింబిస్తున్నాయని తెలిపారు.

వాణిజ్య సంబంధాలు, ఐటీఈసీ శిక్షణ పెంపు

ఇరు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులను ప్రోత్సహించడం, సరఫరా వ్యవస్థలను బలోపేతం చేయడంపై నేతలు చర్చించారు. ఈ పర్యటన సందర్భంగా నిర్వహిస్తున్న ఇండియా-మోల్డోవా బిజినెస్ ఫోరం ఆర్థిక సహకారానికి కొత్త ఊపునిస్తుందని రాష్ట్రపతి ధీమా వ్యక్తం చేశారు. విద్య, కెపాసిటీ బిల్డింగ్‌కు ప్రాధాన్యత ఇస్తూ, మోల్డోవా నిపుణుల కోసం ఐటీఈసీ శిక్షణ స్లాట్లను రెట్టింపు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇందులో కృత్రిమ మేధస్సు, ఆధునిక సాంకేతికతలపై ప్రత్యేక కోర్సులు ఉంటాయని తెలిపారు. అలాగే మోల్డోవా డిప్లొమాట్లను భారతదేశ విదేశీ సర్వీసుల ఇన్‌స్టిట్యూట్‌లో జరిగే ఏఐ, సైబర్ డిప్లొమసీ కార్యక్రమాలకు ఆహ్వానించారు.

అంతర్జాతీయ వేదికలపై సహకారం.. ప్రాంతీయ పరిణామాలు

విపత్తు నిరోధక మౌలిక సదుపాయాల కూటమి (CDRI), గ్లోబల్ బయోఫ్యూయల్స్ అలయన్స్‌లో చేరాలని మోల్డోవాను రాష్ట్రపతి ముర్ము కోరారు. ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్ కింద ఇప్పటికే ఉన్న సహకారాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ప్రాంతీయ, ప్రపంచ పరిణామాలపై ఇరు నేతలు అభిప్రాయాలను పంచుకున్నారు. శాంతి, చర్చలు, అంతర్జాతీయ చట్టాల పట్ల తమకున్న ఉమ్మడి నిబద్ధతను పునరుద్ఘాటించారు. ఘర్షణలను చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే శాంతియుతంగా పరిష్కరించుకోవడానికి భారత్ ఎప్పుడూ కట్టుబడి ఉందని రాష్ట్రపతి స్పష్టం చేశారు. మోల్డోవా ప్రభుత్వం, ప్రజలు అందించిన ఆతిథ్యానికి ధన్యవాదాలు తెలిపారు.

# పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమంపై ప్రభుత్వ స్పష్టత




పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమాన్ని ఇర శాతం కంటే పెంచే ఆలోచన ప్రస్తుతం లేదని కేంద్ర ప్రభుత్వం రాజ్యసభకు వెల్లడించింది. శాస్త్రీయ అధ్యయనాలు, నిపుణుల సంప్రదింపుల ఆధారంగానే భవిష్యత్ నిర్ణయాలు ఉంటాయని పెట్రోలియం శాఖ సహాయమంత్రి సురేశ్ గోపి స్పష్టం చేశారు.

పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమాన్ని ఇర శాతం కంటే ఎక్కువగా పెంచేలా ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. రాజ్యసభలో ఒక ప్రశ్నకు కేంద్ర పెట్రోలియం, సహజవాయువు శాఖ సహాయమంత్రి సురేశ్ గోపి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. భవిష్యత్తులో ఇథనాల్ మిశ్రమాన్ని మరింత పెంచే అంశంపై శాస్త్రీయ, సాంకేతిక అధ్యయనాలు సంబంధిత వర్గాలతో సంప్రదింపులు జరిపిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ20 అనేది కొత్తగా లేదా అకస్మాత్తుగా ప్రవేశపెట్టిన ఇంధనం కాదని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా శతాబ్ద కాలంగా ఇథనాల్‌ను రవాణా ఇంధనంగా వాడుతున్నారని, భారత్‌లో ఇథనాల్ బ్లెండెడ్ పెట్రోల్ కార్యక్రమం రెండు వేల ఒకటిలోనే ప్రయోగాత్మకంగా ప్రారంభమైందని గుర్తుచేశారు.

శాస్త్రీయ అధ్యయనం ఆధారంగానే అడుగులు

ఈ20కి మారే ప్రక్రియ దశలవారీగా, ఆధారాలతో కూడిన పద్ధతిలో జరిగిందని మంత్రి తెలిపారు. శాస్త్రీయ మూల్యాంకనం, సంబంధిత వర్గాల సంప్రదింపుల తర్వాత రెండు వేల పద్నాలుగులో ఒకటిన్నర శాతంగా ఉన్న మిశ్రమం.. రెండు వేల ఇరవై ఐదు ఇరవై ఆరు నాటికి ఇర శాతానికి క్రమంగా పెరిగిందని వివరించారు. తక్కువ మిశ్రమాల వైపు వెనక్కి వెళ్లకుండా, శాస్త్రీయంగా ధృవీకరించబడిన మెరుగైన ఇంధన విధానంతో ముందుకు వెళ్లడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

# నీట్ పేపర్ లీక్ కలకలం.. పార్లమెంట్ వాయిదా



నీట్ పేపర్ లీక్ అంశంపై ప్రతిపక్షాల నిరసనల కారణంగా పార్లమెంట్ ఉభయ సభలు రోజంతా వాయిదా పడ్డాయి. లోక్‌సభ, రాజ్యసభలలో విపక్షాలు ఆందోళన చేపట్టడంతో సభ పలుమార్లు వాయిదాలను ఎదుర్కొని చివరకు రేపటికి వాయిదా పడింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పరీక్ష పేపర్ లీక్ అంశంపై ఉభయ సభల్లో తీవ్ర గందరగోళం చెలరేగింది. పలు అంశాలపై ప్రతిపక్షాలు నిరసనలు తెలపడంతో పార్లమెంట్ ఉభయ సభలు రోజంతా వాయిదా పడ్డాయి. లోక్‌సభ, రాజ్యసభ పలుమార్లు వాయిదాలను ఎదుర్కొన్నాయి. ఉదయం లోక్‌సభ ప్రారంభమైన వెంటనే గతంలో మృతిచెందిన మాజీ సభ్యులకు, ఖతార్ మాజీ అమీర్ షేక్ హమద్ బిన్ ఖలీఫా అల్-థానీకి సభ నివాళులు అర్పించింది. ఆ తరువాత సభలో ప్రశ్నోత్తరాలను చేపట్టేందుకు స్పీకర్ ఓం బిర్లా ప్రయత్నించగా, కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ సభ్యులు నీట్ పేపర్ లీక్ అంశాన్ని లేవనెత్తుతూ నినాదాలు చేశారు. సభ సజావుగా సాగేందుకు సహకరించాలని స్పీకర్ కోరినప్పటికీ విపక్షాలు పట్టించుకోకపోవడంతో సభ పలుమార్లు వాయిదా పడింది.

## లోక్‌సభలో కొనసాగిన గందరగోళం

మధ్యాహ్నం తర్వాత కూడా సభలో అదే పరిస్థితి పునరావృతమైంది. పీఠాధిపతులు, చైర్మన్లు సభను నడిపేందుకు ప్రయత్నించినప్పటికీ విపక్ష సభ్యులు తమ నిరసనలను ఆపలేదు. ప్రశ్నోత్తరాలు, షెడ్యూల్డ్ వ్యవహారాలను చేపట్టేందుకు యత్నించినా ఫలితం లేకపోయింది. చివరికి సభను రోజంతా వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

## రాజ్యసభలోనూ వాయిదాల పర్వం

రాజ్యసభలోనూ ఇదే రకమైన వాతావరణం నెలకొంది. ఉదయం నూతన సభ్యుల ప్రమాణ స్వీకారంతో సభ ప్రారంభమైంది. ఆ తర్వాత మాజీ సభ్యులకు సంతాపం తెలిపారు. ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే నీట్ పరీక్ష పేపర్ లీక్ అంశాన్ని లేవనెత్తడానికి ప్రయత్నించగా, గందరగోళం నడుమ చైర్మన్ సీపీ రాధాకృష్ణన్ సభను వాయిదా వేశారు. మధ్యాహ్నం తర్వాత డిప్యూటీ చైర్మన్ హరివంశ్ సభను నిర్వహించేందుకు యత్నించినప్పటికీ సాధ్యపడలేదు. చివరకు ఉభయ సభలు రేపటికి వాయిదా పడ్డాయి.

# దేశవ్యాప్తంగా పెరిగిన పాఠశాల విద్యార్థుల నమోదు



దేశవ్యాప్తంగా పాఠశాలల్లో విద్యార్థుల నమోదు ఇరవై ఐదు కోట్లకు చేరిందని యూడీఐఎస్ఈ డేటా వెల్లడించింది. విద్యా వ్యవస్థలో నికర నమోదు నిష్పత్తి మెరుగైందని, బాలికల భాగస్వామ్యం పెరిగిందని లోక్‌సభలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. మౌలిక వసతులు కూడా మెరుగవుతున్నాయని పేర్కొన్నారు.

యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్ రెండు వేల ఇరవై ఐదు ఇరవై ఆరు డేటా ప్రకారం దేశవ్యాప్తంగా పాఠశాలల్లో విద్యార్థుల నమోదు సుమారు ఇరవై ఐదు కోట్లకు చేరింది. లోక్‌సభలో అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాతపూర్వక సమాధానం ఇస్తూ ఈ వివరాలు వెల్లడించారు. ప్రాథమిక, ప్రిపరేటరీ, మిడిల్, సెకండరీ దశలలో రెండు వేల ఇరవై నాలుగు ఇరవై ఐదుతో పోలిస్తే రెండు వేల ఇరవై ఐదు ఇరవై ఆరులో నికర నమోదు నిష్పత్తి మెరుగైందని తెలిపారు. అన్ని పాఠశాల దశలలో జెండర్ ప్యారిటీ ఇండెక్స్ ఒకటి లేదా అంతకంటే ఎక్కువగా ఉందని, ఇది బాలికల క్రియాశీల భాగస్వామ్యాన్ని తెలియజేస్తోందని పేర్కొన్నారు.

మెరుగైన మౌలిక వసతులు.. పీఎం శ్రీ పాఠశాలలు

పాఠశాలల్లో బాలికలు, బాలురు, ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల కోసం మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్, హ్యాండ్‌రైల్స్‌తో కూడిన రాంప్‌లు వంటి మౌలిక వసతులు మెరుగుపడ్డాయని మంత్రి తెలిపారు. అంతేకాకుండా ఇంటర్నెట్ సౌకర్యం, కంప్యూటర్ల లభ్యత వంటి ఆధునిక సౌకర్యాలు కూడా పెరిగినట్లు వివరించారు. జాతీయ విద్యా విధానం రెండు వేల ఇరవైకి అనుగుణంగా ఆదర్శ పాఠశాలలుగా ప్రధాన్ మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా పదిమూడు వేలకు పైగా పీఎం శ్రీ పాఠశాలలు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు.

దిల్లీలో యూఏఈ మంత్రితో కింజరాపు రామ్మోహన్ నాయుడు భేటీ

## దిల్లీలో యూఏఈ మంత్రితో కింజరాపు రామ్మోహన్ నాయుడు భేటీ




కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు దిల్లీలో యూఏఈ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రితో సమావేశమయ్యారు. విమానయాన రంగంలో తయారీ, నిర్వహణ తదితర అంశాలపై ఇరు దేశాల మధ్య సహకారాన్ని మరింత విస్తరించడంపై వారు చర్చించారు.

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు దిల్లీలో సోమవారం యూఏఈ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రితో సమావేశమయ్యారు. భారత్‌లో వేగంగా విస్తరిస్తున్న విమానయాన రంగంలో కొత్త అవకాశాలను అన్వేషించడంపై ఇద్దరు మంత్రులు చర్చించినట్లు రామ్మోహన్ నాయుడు సోషల్ మీడియా వేదికగా తెలిపారు. ముఖ్యంగా విమానాల నిర్వహణ, మరమ్మతులు, ఓవర్‌హాల్ తయారీ రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. భారత్, యూఏఈ మధ్య బలమైన ద్వైపాక్షిక సంబంధాలకు పటిష్టమైన విమాన సర్వీసుల అనుసంధానమే మూలస్తంభమని ఆయన తెలిపారు.

## మహిళా సాధికారత కోసం అనేక కార్యక్రమాలు

రాష్ట్రంలో మహిళా సాధికారత కోసం అనేక కార్యక్రమాలు ప్రజా ప్రభుత్వం చేపట్టిందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. భారతీయ పరిశ్రమల సమాఖ్య మహిళా విభాగం ప్రధాన కార్యాలయ నిర్మాణం కోసం శిల్పారామం వద్ద వెయ్యి గజాల స్థలాన్ని కేటాయిస్తుందని ఆయన నిన్న ప్రకటించారు. భారతీయ పరిశ్రమల సమాఖ్య మహిళా విభాగం ఏర్పాటై 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆ విభాగం ప్రతినిధులు హైదరాబాద్ లో ముఖ్యమంత్రితో నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. మహిళా సాధికారత కోసం రాష్ట్రంలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు.

రాష్ట్రంలో మహిళా సాధికారత కోసం అనేక కార్యక్రమాలు ప్రజా ప్రభుత్వం చేపట్టిందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. భారతీయ పరిశ్రమల సమాఖ్య మహిళా విభాగం ప్రధాన కార్యాలయ నిర్మాణం కోసం శిల్పారామం వద్ద వెయ్యి గజాల స్థలాన్ని కేటాయిస్తుందని ఆయన నిన్న ప్రకటించారు. భారతీయ పరిశ్రమల సమాఖ్య మహిళా విభాగం ఏర్పాటై 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆ విభాగం ప్రతినిధులు హైదరాబాద్ లో ముఖ్యమంత్రితో నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. మహిళా సాధికారత కోసం రాష్ట్రంలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు.

# టీవీల మూసివేత అంటూ వార్తలు.. ఖండించిన కేంద్ర ప్రభుత్వం




టీవీలు మూతపడతాయని, కేబుల్ ఛార్జీలు భారీగా పెరుగుతాయని సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు అవాస్తవమని పీఐబీ ఫాక్ట్ చెక్ యూనిట్ తేల్చింది. టెలివిజన్, రేడియో సేవలకు సంబంధించి ప్రభుత్వం ప్రవేశపెట్టిన డ్రాఫ్ట్ నిబంధనలు కేవలం సంప్రదింపుల దశలోనే ఉన్నాయని స్పష్టం చేసింది.

టీవీల మూసివేత, కేబుల్ డీటీహెచ్ ఛార్జీల పెంపుపై సోషల్ మీడియాలో సర్క్యులేట్ అవుతున్న తప్పుడు ప్రచారాన్ని ప్రభుత్వం ఖండించింది. పదకొండు కోట్ల టీవీలు మూతపడతాయని, కేబుల్, డీటీహెచ్ ఛార్జీలు నాలుగు నుంచి ఆరు రెట్లు పెరుగుతాయని, భారీ లైసెన్సింగ్ ఫీజులు విధిస్తారని వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేసింది. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఫాక్ట్ చెక్ యూనిట్ ఈ ప్రచారాన్ని ఫేక్‌గా తేల్చింది. దేశంలో టెలివిజన్ సేవలను నిలిపివేసేలా లేదా సబ్‌స్క్రిప్షన్ ఛార్జీలను భారీగా పెంచేలా ప్రభుత్వం ఎలాంటి కొత్త నిబంధనలను ప్రవేశపెట్టలేదని వెల్లడించింది.

డ్రాఫ్ట్ నిబంధనలపై పీఐబీ క్లారిటీ

సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ టెలికమ్యూనికేషన్స్ టెలివిజన్, రేడియో అండ్ అసోసియేటెడ్ సర్వీసెస్ రూల్స్ రెండు వేల ఇరవై ఆరు డ్రాఫ్ట్‌ను ప్రచురించిందని పీఐబీ స్పష్టం చేసింది. ఈ నిబంధనలు ప్రస్తుతం ఈ ఏడాది జూలై ఇరవై ఏడు వరకు ప్రజలు, వాటాదారుల సంప్రదింపుల కోసం అందుబాటులో ఉన్నాయని తెలిపింది. ఈ డ్రాఫ్ట్ నిబంధనలలో ఎలాంటి ఫీజులను పెంచే ప్రతిపాదన లేదని స్పష్టం చేసింది. టెలివిజన్, రేడియో రంగంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను ప్రోత్సహిస్తూ, ఇప్పటికే ఉన్న విధానాలను సరళీకృతం చేయడానికి క్రమబద్ధీకరించడానికి మాత్రమే ఈ నిబంధనలను రూపొందించినట్లు వివరించింది.

టీవీలు మూతపడతాయని, కేబుల్ ఛార్జీలు భారీగా పెరుగుతాయని సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు అవాస్తవమని పీఐబీ ఫాక్ట్ చెక్ యూనిట్ తేల్చింది. టెలివిజన్, రేడియో సేవలకు సంబంధించి ప్రభుత్వం ప్రవేశపెట్టిన డ్రాఫ్ట్ నిబంధనలు కేవలం సంప్రదింపుల దశలోనే ఉన్నాయని స్పష్టం చేసింది.

# చార్ ధామ్ యాత్ర తాత్కాలిక నిలిపివేత



భారీ వర్షాలు, కొండచరియల ప్రమాదం కారణంగా ఉత్తరాఖండ్‌లో చార్ ధామ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేశారు. భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాల హెచ్చరికలు, పలు ప్రాంతాలలో కొండచరియలు విరిగిపడుతున్న నేపథ్యంలో భద్రతా చర్యల్లో భాగంగా చార్ ధామ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేశారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో యాత్ర మార్గంలో ప్రయాణించే భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు.

అధికారులు, యాత్రికులకు కీలక సూచనలు

రోడ్లు దెబ్బతిన్న ప్రాంతాలలో యాత్రికులను సురక్షిత ప్రాంతాలకు చేర్చాలని, మార్గాలు పూర్తిగా సురక్షితమని తేలిన తర్వాతే యాత్రను పునఃప్రారంభించాలని గర్వాల్ కమిషనర్ ఆనంద్ స్వరూప్ సంబంధిత జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. భక్తుల రక్షణే తమ అత్యున్నత ప్రాధాన్యమని యంత్రాగనం స్పష్టం చేసింది. వదంతులను నమ్మవద్దని, కేవలం అధికారిక ప్రకటనలను మాత్రమే అనుసరించాలని యాత్రికులకు అధికారులు విజ్ఞప్తి చేశారు.

# తొలి డెంగీ వ్యాక్సిన్‌కు కేంద్రం ఆమోదం



డెంగీ నివారణ కోసం జపాన్ సంస్థ తయారుచేసిన క్యూడెంకా వ్యాక్సిన్‌కు డీసీజీఐ ఆమోదం తెలిపింది. నాలుగు నుంచి అరవై ఏళ్ల వయసువారు మూడు నెలల వ్యవధిలో రెండు డోసులుగా ఈ వ్యాక్సిన్ తీసుకోవచ్చు. దేశంలో పెరుగుతున్న డెంగీ కేసుల నియంత్రణకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని నిపుణులు భావిస్తున్నారు.

దేశంలో డెంగీ వ్యాధిని నివారించే తొలి వ్యాక్సిన్‌కు డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా అధికారికంగా ఆమోదం తెలిపింది. జపాన్‌కు చెందిన టకేడా బయోఫార్మాస్యూటికల్స్ సంస్థ తయారుచేసిన 'క్యూడెంకా' వ్యాక్సిన్‌కు డీసీజీఐ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నాలుగు నుంచి అరవై ఏళ్ల వయసువారు ఈ వ్యాక్సిన్‌ను వేసుకోవడానికి అర్హులు. గతంలో ఎప్పుడైనా డెంగీ బారిన పడ్డారా లేదా అనేదానితో సంబంధం లేకుండా, ముందస్తు వ్యాక్సినేషన్ టెస్టింగ్ ఏమీ చేయించుకోకుండానే నేరుగా ఈ వ్యాక్సిన్ తీసుకోవచ్చని వెల్లడించారు. డెంగీకి కారణమయ్యే నాలుగు రకాల వైరస్ సీరోటైప్‌ల నుంచి ఈ వ్యాక్సిన్ రక్షణ కల్పిస్తుంది.

వ్యాక్సిన్ మోతాదు, ట్రయల్స్ ఫలితాలు

ఈ వ్యాక్సిన్‌ను సున్నా పాయింట్ ఐదు ఎంఎల్ చొప్పున మూడు నెలల వ్యవధిలో రెండుసార్లు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు చేసిన ఈ వ్యాక్సిన్ ఇప్పటికే ఆసియాలోని నలభై మూడు దేశాల్లో ఆమోదం పొందింది. భారత్‌లో ఏటా వేలాది మంది దోమల ద్వారా వ్యాపించే డెంగీ బారిన పడుతున్నారు. గత ఏడాది దేశంలో లక్షకుపైగా కేసులు నమోదు కాగా, నమోదు కాని సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుందని అంచనా. ప్రపంచంలో నమోదయ్యే మొత్తం డెంగీ కేసుల్లో మూడోవంతు భారత్‌లోనే ఉంటున్నాయి. ఈ తరుణంలో వ్యాక్సిన్‌కు ఆమోదం లభించడం ప్రాధాన్యత సంతరించుకుంది. రెండు డోసులు పూర్తయిన తర్వాత డెంగీ కారణంగా ఆసుపత్రిలో చేరాల్సిన అవసరాన్ని ఈ వ్యాక్సిన్ ఎనుబై నాలుగు శాతానికి పైగా నిరోధించినట్లు క్లినికల్ ట్రయల్స్‌లో తేలింది.

# కొనసాగుతున్న ఎనిమిదో బ్రిక్స్ ప్రాసిక్యూషన్ సమావేశం




భారతదేశ ఆతిథ్యంలో ఎనిమిదో బ్రిక్స్ ప్రాసిక్యూషన్ సేవల అధిపతుల సమావేశం ప్రారంభమైంది. రెండు రోజుల పాటు వర్చువల్‌గా జరిగే ఈ సదస్సులో క్రిమినల్ జస్టిస్ వ్యవస్థలో పారదర్శకత, బాధితుల కేంద్రంగా సంస్కరణలపై చర్చిస్తున్నారు.
న్యాయ వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో ఎనిమిదో బ్రిక్స్ ప్రాసిక్యూషన్ సేవల అధిపతుల సమావేశం ప్రారంభమైంది. రెండు రోజుల పాటు వర్చువల్ విధానంలో జరిగే ఈ సదస్సు ద్వారా భారత్ నిర్దేశించుకున్న 'సమర్థత, ఆవిష్కరణ, సహకారం, స్థిరత్వం' అనే బ్రిక్స్ దార్శనికత ముందుకు సాగుతోంది. బ్రిక్స్ దేశాల మధ్య ఆర్థిక వృద్ధికి తోడ్పడేలా స్థిరమైన, పారదర్శకమైన చట్టపరమైన విధానాలను రూపొందించే దిశగా ఈ సమావేశం ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుందని కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

క్రిమినల్ జస్టిస్ సిస్టమ్‌లో కీలక చర్చలు

ఈ ఏడాది సమావేశంలో క్రిమినల్ జస్టిస్ వ్యవస్థను మరింత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా, బాధితులకు అనుకూలంగా మార్చడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రాసిక్యూషన్ సేవలపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించేందుకు సభ్య దేశాలు తమ అనుభవాలను పరస్పరం పంచుకోనున్నాయి. ఈ రెండు రోజుల పాటు సీనియర్ నేతలు ఆధునిక సంస్థాగత సవాళ్లు, విచారణ విధానాల్లో ఉత్తమ పద్ధతులపై విస్తృతంగా చర్చిస్తారు.

# కాంగోలో వేగంగా వ్యాపిస్తున్న ఎబోలా వైరస్




కాంగో దేశంలో ఎబోలా వైరస్ ఉధృతి కొనసాగుతోంది. ఇప్పటివరకు వేల సంఖ్యలో కేసులు, వందల సంఖ్యలో మరణాలు సంభవించాయి. ఈ వ్యాధికి తగిన చికిత్స అందుబాటులో లేకపోవడంతో తీవ్రత పెరుగుతోంది.

మధ్య ఆఫ్రికా దేశం కాంగోలో ఎబోలా వైరస్ తీవ్ర రూపం దాల్చుతోంది. మే 15 నుంచి శనివారం నాటికి దేశవ్యాప్తంగా రెండు వేల మూడు వందల నలభై నాలుగు కేసులు నమోదవగా, దాదాపు తొమ్మిది వందల ముప్పై మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఆ దేశ ఆరోగ్యశాఖ వెల్లడించింది. కేవలం ఒక్క రోజు వ్యవధిలో ముప్పై ఏడు మరణాలు సంభవించినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం నమోదవుతున్న కేసులన్నీ బుండిబుగ్యో ఎబోలా రకానివేనని స్పష్టం చేశారు. ఈ వైరస్‌ను అరికట్టడానికి ప్రస్తుతం సరైన వ్యాక్సిన్ గానీ, చికిత్స గానీ అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

వైరస్ లక్షణాలు.. వ్యాప్తి చెందే విధానం

సాధారణంగా ఎబోలా వైరస్ జంతువులు, గబ్బిలాలకు సోకుతుంది. వ్యాధి సోకిన జంతువులను వేటాడి వాటి మాంసం తినడం ద్వారా మనుషులకు వ్యాపిస్తుంది. ఈ వ్యాధి లక్షణాలు కనిపించడానికి ఇరవై ఒక్క రోజులు పడుతుంది. తొలుత ఫ్లూ, మలేరియా, జ్వరం వంటి సాధారణ లక్షణాలు కనిపించినప్పటికీ, క్రమంగా అవయవాల వైఫల్యానికి దారితీసే ప్రమాదం ఉంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు పాటించాలని ఆరోగ్య శాఖ అధికారులు సూచిస్తున్నారు.

# సుభాషితాలు

యర్రమిల్లి రామారావు

జీవితంలో బంధుత్వాలైనా, ప్రేమలైనా, స్నేహాలైనా,,,, ఈ జన్మకే. మరో జన్మ ఉందో లేదో తెలియదు. ఉన్నా ఈ జన్మలో పొందిన తీయదనం మరో జన్మలో గుర్తు ఉండదు. అందుకే ఈ చిన్న జీవితాన్ని అందరితో కలిసి మెలిసి సంతోషంగా గడిపేలా ప్రయత్నించాలి. అందరూ ఒకే కుటుంబంలా ఉండాలి.

ఎక్కడైతే నిన్ను హేళన చేశారో అక్కడే నిన్ను నిరూపించుకో. ఎక్కడైతే నిన్ను తక్కువ అంచనా వేశారో అక్కడ నువ్వు గెలిచి చూపించు. ఒదిన నాడు నిన్ను చూసి హేళన చేసినవారు గెలిచిన నాడు నిన్ను చూసి జేజేలు కొడతారు.

తగిలిన ప్రతి గాయాన్ని జ్ఞాపకంగా పెట్టుకుంటే అది బాధ. ఆ తగిలిన ప్రతి గాయాన్ని పాఠంగా మార్చుకుంటే అది మార్పు . ఎందుకంటే ముల్లుని తొక్కిన కాలు బాధపడుతూ అక్కడే ఉండిపోకూడదు. మరింత జాగ్రత్తగా నడవడం మొదలుపెట్టాలి.

నమ్మితే ప్రాణమైనా ఇస్తా అంటారు. ప్రాణం ఇవ్వనవసరం లేదు. ప్రాణం ఉన్నంతవరకు నమ్మక ద్రోహం చేయకుండా ఉంటే చాలు..!

స్వర్గంలో అన్నీ ఉన్నాయి, చావు లేదు!! భగవద్గీతలో అన్నీ ఉన్నాయి, కానీ అబద్ధాలు లేవు!! ప్రపంచంలో అన్నీ ఉన్నాయి, కానీ ప్రశాంతత లేదు!! కానీ ఈ రోజు అందరి దగ్గర అన్నీ ఉన్నాయి, కానీ మనశ్శాంతి లేదు..!!

సమాజంలో మార్పు ఎందుకు రాదంటే..? పేదవారికి □ధైర్యం□లేక .! మధ్యతరగతివారికి □సమయం□ లేక..! ధనవంతులకు □అవసరం□ లేక..!

జీవితం అనేది వద్దనుకుంటే పోయేది కాదు, రాసుకుంటే వచ్చేది కాదు..! జీవితం ఒక రంగ స్థలం. నీవు, నేను అందరం పాత్రధారులం.. రాసేవాడు పైన ఉన్నాడు, నటించేవాళ్ళు మనతో ఉన్నారు..!

కొన్ని పరిచయాలు ఆనందాన్ని ఇస్తాయి. కొన్ని అనుభవాన్ని ఇస్తాయి. కొన్ని బాధను, కొన్ని జీవితంలో ఎలా బతకాలో నేర్పు తాయి. కొన్ని ఏ పరిచయం శాశ్వతం కాదు అనే గుణపాఠాన్ని నేర్పు తాయి.

స్వచ్ఛమైన మనసున్నవాళ్ళు... అన్ని విషయాలు బయటకు చెప్పేస్తారు!! మనసులో ఏదీ దాచుకోరు!! వాళ్లకు ప్రేమించటం తప్ప, నటించటం రాదు. వాళ్ళ కోపం క్షణకాలం ఉంటుంది!! వాళ్ళ ప్రేమ జీవితకాలం ఉంటుంది!!

# కాశీమజిలీ కథలు

డా. మాదిరాజు బ్రహ్మానంద రావు



## కాశీమజిలీ కథలు-ఏడవ భాగం తరువాయి)

ఒకరోజు సాయంకాలం చిలుక మామిడి చెట్టుపై కూర్చొనిఉంది. ఆ సమయంలో ఆ చెట్టు క్రిందనున్న సరస్సులో విద్యాధరకన్యలైన రాగమంజరి, కుసుమగంధితోపాటు మరికొందరు కాంతలు జలక్రీడలు చేస్తూ వారనుకుంకుంటున్న మాటలను చిలుకరూపంలో ఉన్న దండుడు వినసాగాడు. వారిలో రాగమంజరి తనచెలులకు తనకెదురయిన ఒక సంఘటనను గురించి చెప్పసాగింది. "ఒక రోజు భూలోకంలో ఒక సరోవరంలో నేను బట్టలు విడిచి స్నానం చేస్తుంటే చెట్టు కొమ్మల్లో దాగియున్న ఒక మానవుడు నా బట్టలు అపహరించి చెట్టుపై కూర్చున్నాడు. నేను మాయోపాయంతో వానిని చెట్టు దింపించి నా చీరలు తీసుకొని వానిని బండరాయిగా మారమని శపించి వచ్చాను. ఆ బట్టలు నాకు దొరక్కపోతే వానికి భార్యగా ఉండవలసి వచ్చేది" అంటూ జరిగిన సంఘటన చెప్పింది. అప్పుడు కుసుమగంధి "శపించి శాపవిమోచన చెప్పకపోతే పాపం వస్తుంది. తిరిగి అతని రూపు పొందటానికి మార్గం ఏదైనా ఉందా" అని అడిగింది. అందుకు రాగమంజరి " ఉంది. ఆ చెట్టు మొదట ఉన్న తీగ ఆకును నీటితో కలిపి ఆ రాతిపై చల్లితే తిరిగి ఇదివరకటి రూపు వస్తుంది." వీరి సంభాషణ అంతా విన్న చిలక రూపంలో ఉన్న దండుడు 'బహుశా అతడు సాంబుడై యుంటాడని భావించాడు.

ఒకనాడు విద్యుత్ప్రభ భూలోకంలో ఉన్న తన ఉద్యానవనానికి విహారానికై వచ్చింది. ఇదే సమయమనుకొని చిలక రివ్వున ఎగిరి పూలగుత్తిని వాసన చూసింది. చిలుక మానవరూపంతో ఆమె ముందు నిలబడింది. ఆమె ఆశ్చర్యంతో ఇంతవరకు తానాదరించింది మానవరూపంలో ఉన్న చిలుకనా! అంటూ ఆశ్చర్యపోయింది. 'మీరెవర'ని ప్రశ్నించింది. అప్పుడు దండుడు "నేను మీ తాతయైన మయుని వంశములోని వాడ' నంటూ తన గడచిన కథనంతా చెప్పి తనకు విమానాలు చేసే విద్య కూడా నీ వల్ల అబ్బిందని అన్నాడు. ఆమె కూడా అతని అందాన్ని చూసి తమవంశం వాడని గుర్తించి గాంధర్వవిధిని వివాహమాడింది.

కొంతకాలం గడిచిన తర్వాత దండుడు విద్యుత్ప్రభకు తన మిత్రుల వృత్తాంతం చెప్పి 'వారినికలుసుకోవటానికిపోయివస్తా'నని అన్నాడు.ఆమె తమ ఎడబాటునకు విచారిస్తుండగా' నీవు కామరూపిణివి కాబట్టి- నీవు ఎప్పుడైనా ఎక్కడైనా నన్ను కలవడానికి రావచ్చును కదా! ' అంటూ ఆమెనొప్పించాడు. మహిమ గల రెండు రకాల పువ్వులను తీసుకొని దండుడు మిత్రులను వెదకటానికి బయలుదేరాడు. సాంబుడు శిలారూపంలో ఉన్నాడని తెలుసుకొని మొదటగా అతనిని శాపవిముక్తుని చేయాలనుకొని అతడు శిలయై పడియున్న చెట్టు దగ్గరకు వచ్చాడు. విద్యాధరి రాగమంజరి చెప్పిన ఆకులు నీటిలో ముంచి ఆ శిలపై చల్లగా సాంబుడు నిజరూపాన్ని పొందాడు. ఇద్దరు ఒకరినొకరు చూసుకొని సంతోషపడ్డారు.

తనకు విద్యుత్ప్రభకు వివాహమైన విధానాన్ని చెబుతూ సాంబునితో "నిన్ను శపించింది రాగ మంజరి అనే విద్యాధర కన్య. ఆమె రేపు జలక్రీడకై ఇక్కడికి వస్తుంది. ఆ సమయంలో ఆమె చీరను ఎత్తుకొని వచ్చి ఆమె బ్రతిమాలినా ఇవ్వవద్దని" హెచ్చరించి చెప్పాడు. మరునాడు రాగమంజరి చెలులతో స్నానం చేస్తుండగా సాంబుడు ఆమె చీరను ఎత్తుకొని పోయాడు. తన చీరను దొంగలించిన వానికై వెదుకుతుంటే దండుడక్కడ కనిపించాడు. దండుడామెకు వేరొక వస్త్రాన్ని కట్టుకోటానికిచ్చి విషయం అడిగాడు. ఆమె 'తన చీరెనెవరో ఎత్తుకొని పోయారని తిరిగి దానినిప్పించ'మని కోరింది. దండుడు సాంబుని పిలిచి ఆమె చీర తిరిగివ్వమని కోరాడు. ఇవ్వనని దండుడు చెప్పాడు. వీరి ముగ్గురి నడుమ కొంత సంవాదం జరిగింది. 'దీనికి పరిష్కారం తన భార్య విద్యుత్ప్రభ ఇవ్వగలదని ఆమెను పిలుస్తా'నంటూ దండుడు విద్యుత్ప్రభను తలచుకోగా ఆమె వచ్చింది. రాగమంజరిని సాంబునితో వివాహానికి ఒప్పించింది. విద్యుత్ప్రభ దండులు కలిసి రాగమంజరి సాంబుల వివాహాన్ని జరిపించారు.

దండుడు సాంబుడు తన మిత్రుడు వసంతుని వెతకటానికి బయలుదేరారు. వీరు వసంతుడు వెళ్లిన మార్గంలోనే వెళుతూ నిర్జనపురాన్ని దాటి కోటగుమ్మం గుండా కోటలోనికి ప్రవేశించారు. అక్కడ సగం ప్రాణాలతో ఉన్న వసంతుని చూశారు. అతని ప్రక్కనే సగం అరగ తీయబడిన కత్తియొరను చూసారు. దానిని చూస్తూ దండుడు "అయ్యో! నేను వసంతుని ప్రాణాలను ఈ కత్తి యొరలో నిక్షిప్తం చేసి పెట్టాను. ఈ రహస్యాన్ని తెలుసుకొన్నవారు కత్తియొరను అరగదీశారు. అందుకే వసంతునకు ప్రాణాపాయం వచ్చింది" అని దండుడు తిరిగి తన విద్యా చాతుర్యంచే అరగదీయబడిన కత్తియొరభాగాలన్నీ చక్కగా చేసాడు. వసంతుడు నిద్ర మేల్కొన్నవానిగా లేచి 'కళావతీ! కళావతీ! ' అంటూ కలవరింపసాగాడు. కొంతసేపటికి వసంతుడు స్పృహలోనికి వచ్చి ఎదురుగా ఉన్న తన మిత్రులను చూసి ఆనందించాడు. వారికి తన వృత్తాంతం చెప్పి ఒక ముసలిది తన్ను సగం చంపి కళావతి ఎత్తుకుపోయిన విషయాన్ని చెప్పాడు. దండుడు తనకు విమానం చేసే విద్య తెలుసునని చెప్పి ఒక విమానాన్ని నిర్మించాడు. ముగ్గురు అందులో ఎక్కి కళావతిని వెదకటానికి బయలుదేరారు.

వారట్లా వెతుకుతూ ప్రవరుడు మంత్రిగా ఉన్న హేలాపురానికి వచ్చారు. అక్కడో సత్రంలో బస చేశారు. ఆ సత్ర ముఖద్వారానికి ఉన్న చిత్రపటాన్ని చూసి 'ఇది మన మిత్రుడు ప్రవరునిదిగా ఉన్నదని దానిని తదేకంగా చూడసాగారు.

అప్పుడక్కడున్న భటులు మంత్రి ఆజ్ఞ ప్రకారం వారి ముగ్గురిని మంత్రి ఎదుటకు తీసుకొని వెళ్లారు. వారిని ప్రవరుడు గుర్తుపట్టాడు.

అయినా వారు తనను గుర్తుపడతారా లేదా చూద్దామనుకొని మాట్లాడకుండా ఊరుకొన్నాడు. దండుడు ప్రవరుని గుర్తించి 'ఇతడు మన మిత్రుడు ప్రవరుడే ' అని గట్టిగా అరిచాడు. వారు నలుగురు మిత్రులు అంతులేని ఆనందాన్ని పొందారు. ఒక్కొక్కరు తమతమ కథలను చెప్పుకున్నారు. 'ఇప్పటికి నలుగురం కలిసాము. ఇంకా రాముడొక్కడే కలవాల్సి ఉంది' అని అనుకుంటున్న సమయంలో ద్వారపాలకుడు వచ్చి 'దేవా మీ చిత్రపటాన్ని సాభిప్రాయంగా చూసిన దంపతులను తీసుకొని వచ్చాము. వారిని ప్రవేశపెట్టమంటారా' అని అడగ్గా మంత్రి సరేనన్నాడు. వారిని చూడగానే ఆ వచ్చినది రాముడని అందరూ హర్షధ్వానాలు చేశారు. రాముడు కూడా మిత్రులను కలుసుకొన్నందులకు సంతోషిస్తూ తనను ఒక కోయదొర కుక్కగా మార్చడం- కనకప్రభ తనను తిరిగి మనిషిగా చేయడం మొదలైన తన కథనంతా చెప్పాడు. వసంతుని భార్య కళావతి ఈ దేశాన్ని పరిపాలించే కందర్పకేతు చెరలో ఉన్నదని- సామవిధానంగా మొదట రాజునకు నచ్చజెప్పి కళావతిని విడిపిద్దామని లేదంటే యుద్ధమే ప్రకటిద్దామనే ఒక నిర్ణయానికి ఐదుగురు మిత్రులు వచ్చారు. అప్పుడు దండుడు ''ఈ రాజు పరాక్రమహీనుడు-బుద్ధిహీనుడు అతని సంగతి మంత్రినైన నాకు బాగా తెలుసు. ఈ కోటను నిమిషాల్లో స్వాధీనం చేసుకోవచ్చు. అయినా మనం సామోపాయం చేతనే రాజును లొంగదీసుకోవాలి'' అని చెప్పాడు. వారు నలుగురు నల్లబట్టలు ఎఱ్ఱని కిరీటాలతో భయంకర వేషాలతో రాజసభకు వచ్చారు. వసంతుడు రాజసింహాసనంపై కూర్చొని కందర్పకేతుని రాజసభకు రావలసిందిగా కబురు పంపాడు. ఆ సమయంలో రాజు రాణితో వినోదంగా కాలం గడుపుతున్నాడు. ఇంతలో వార్తాహరులు వచ్చి 'రాజా!రాజ్యాన్ని శత్రువులాక్రమించారు. మిమ్మల్ని రాజసభకు రమ్మంటున్నా'రని చెప్పగా రాజు 'కాదు మంత్రిని పిలవ'మన్నాడు. 'మంత్రి కూడా శత్రుపక్షంలో చేరిపోయాడు' అని వార్తాహరుడు చెప్పగా దాంతో రాజునకు వణుకు ప్రారంభమైంది. 'ఇప్పుడేం చేద్దాం' అంటూ రాణినడుగగా 'ఆమె మీరు క్షత్రియులే కదా యుద్ధం చేయండి' అంది. 'నేను చిన్నప్పటి నుంచి సుకుమారంగా పెరిగాను. యుద్ధమన్నా కత్తిపోట్లన్నా నాకు గిట్టవు. మనమెట్లైనా పారిపోదా'మని రాజనగా రాణి రాజుపిరికితనాన్ని అసహ్యించుకుంటూ 'మీరుండండి. నేను పోయి సంధి చేసుకుని వస్తాను' అని అంటుండగానే వార్తాహరుడు వచ్చి 'రాజుగారు సభాప్రాంగణానికి రాకపోతే మేమే అక్కడకు వస్తాం' అని చెప్పమ'న్నార న్నాడు. దీన్ని విన్న రాజుకు చావు భయం పట్టుకొంది. మంచంపై చచ్చిన వాని లాగా ముసుగు పెట్టుకొని పడుకున్నాడు. ఇంతలో ఐదుగురు మిత్రులు అక్కడికి వచ్చారు. రాణి మంత్రితో ''అన్నా!

మేము మీకేం అపకారం చేశాము" అని అంటుండగా ప్రవరుడు రాజు వద్దకు వెళ్లి ముసుగు ఎత్తి చూసాడు. రాజు ప్రాణాలు కోల్పోయిన వాని వలె నటింపసాగాడు. అప్పుడు ప్రవరుడు 'రాజుతో-పాటు దుర్మార్గం పనులలో పాల్గొనే ఒక ముసలిది ఉండాలి కదా! అదెక్కడ' అని అడిగాడు.

ఇక్కడ రాజు చావటా-నికి సిద్ధంగా ఉన్నాడని విన్న ముసలిది "అయ్యో! కళా-వతిని మాయ చేసి తెస్తే నాకు రాజు నాకు అర్ధరా-జ్యమిస్తానన్నాడు. ఇప్పుడు రాజు చావుబ్రదుకుల మధ్య నున్నాడు. ఇప్పుడే నేను రాజు వద్దకు వెళ్లి అర్ధరాజ్యా-న్ని సంపాదించుకుంటాను" అంటూ అక్కడకు వచ్చింది. ముసలిదానిని అందరూ నిలదీయగా ఆమె నిజాన్ని ఒప్పుకుంటూ మిత్రులంద-రికీ జరిగిన కథంతాచెప్పి-' కళావతి రాజునకు స్వాధీనం కావటానికి సంవత్సరం గడువు కోరిందని- ఆమె పతివ్రత'- అని స్పష్టం చేసింది. తనకు చేసిన అపకారానికి ముసలి దానిని వసంతుడు చంపబోగా ప్ర-వరుడు 'స్త్రీ వధ మహాపాప' మంటూ నివారించాడు. ఇదంతా గమనిస్తున్న రాజ-పత్నిమిత్రులందరినీ తనకు పతిభిక్షపెట్టమని కోరింది. అపుడు ప్రవరుడు తన మిత్రుల కథలన్నీ రాణికి చెప్పి 'రాజు చెరబట్టిన కళావతి సార్వభౌముని కు-మారుడైన వసంతుని భార్య' యని చెపుతుండగనే-అప్ప-టిదాకా ముసుగు పెట్టుకొని పడుకున్న రాజు ఒక్కసా-రిగా లేచి వారితో తనను మన్నించమని అడిగాడు. వారందరు కళావతి ఉన్న చోటికి వెళ్లారు.

కళావతి వసంతుని చూసి ఆనందించింది. వసంతుడు తన మిత్రులను కలుసుకున్న వివరాలను భార్యకు చెప్పాడు.

వసంతుడు తన మిత్రులతో 'మనం మన తల్లిదండ్రులను వదిలి చాలా కాలం అయింది. మనం వెంటనే వారి దగ్గరి-కి వెళ్ళాలి' అనగా దండుడు తాను తయారు చేసిన కీ-లురథాన్ని సిద్ధం చేస్తానన్నా-డు. అందరు తమదేశమైన మధురకు బయలుదేరారు. దండుడు తన భార్య వి-ద్యుత్ప్రభను తలచుకోగానే ఆమె వచ్చింది. సాంబుడు తన భార్య రాగమంజరిని తలచుకోగానే ఆమెకూడా వచ్చింది.

తయారుచేసిన కీలురథం-పై వసంతుడు కళావతితో-ను; ప్రవరుడు కాంచనవల్లి తోను; దండుడు విద్యు-త్ప్రభతోను; సాంబుడు రా-గమంజరితోను బయ-లుదేరారు. మొదటగా వారందరు కలిసి రాముని భార్య పద్మగంధి నగరాని-కి వెళ్లారు. ఆమెను కూడా రథం ఎక్కించుకుని తమ దేశానికి వెళ్లారు.

భార్యలతో తిరిగివచ్చిన తమ కుమారులను చూచి తల్లి-దండ్రులు ఆనంద పడ్డారు. కథ మొదట్లో గోపుడు చూసి న కీలురథం వ-ర-ప్ర-సా-దులు వారి భార్యలతో ప్ర-యాణిస్తుండగా చూసినదే. ఈ కథనంతా చెప్పి మణిసి-ద్ధుడు గోపుని ప్రశ్నకు సమా-ధానమిచ్చాడు.

*ఇది వరప్రసాదుల కథ"

(ఇంకా వుంది)

# ఒకే అవసరం... ఒకే వ్యక్తి... రెండు వ్యక్తిత్వాలు

పాలకుర్తి రామమూర్తి



**అతఁడు పవళింప మును కౌరవాధినాథుఁ**
**డరిగి తలయంపి దెస నున్నతాసనమున**
**నుండెఁ, బదపడి కాల్కడ యొద్ద కల్లఁ**
**జని వినమ్రుడై నిలుచుండె సవ్యసాచి!**
**(మహాభారతం - ఉద్యోగపర్వం - తిక్కన-65)**

కౌరవ పాండవుల మధ్య యుద్ధం అనివార్యమయింది. ఎవరెవరి పరిధిలో వారు యుద్ధ సన్నాహాలు చేసుకుంటున్నారు. బంధువుల సహాయసహకారాలకై ప్రయత్నిస్తున్నారు. ఆ క్రమంలో దుర్యోధనుడు, అర్జునుడు కృష్ణుని సహాయం కోరి ద్వారకకు వచ్చారు. ముందుగా దుర్యోధనుడు వచ్చి నిద్రిస్తున్న కృష్ణుని తలవైపున ఉన్న ఉన్నతాసనంపై కూర్చున్నాడు. పిదప అర్జునుడు వచ్చి కృష్ణుని పాదాల చెంత వినమ్రుడై నిలుచున్నాడు.

అంతలో కృష్ణుడు నిద్రలేచి ముందుగా అర్జునుని చూచి ఆ పిదప దుర్యోధనుని చూచి ఆ సమయానికి తగిన మర్యాదతో వారిని ఎంతగానో ఆదరించి ప్రసన్నులను చేసాడు. ఆంతరంగికంగా కృష్ణుడు దుర్యోధన, అర్జునుల స్వభావాలలోని భేదాన్ని గ్రహించినా, బాహ్య ప్రవర్తనలో సమత్వాన్ని పాటించాడు.

దుర్యోధనుడు, అర్జునుడు ఒకే పనిపై ఒకే వ్యక్తి వద్దకు వచ్చారు. ఇక్కడ వారు ప్రవర్తించిన వైఖరి వారి నైజాన్ని తెలుపుతున్నది. వారి వారి స్వభావాలకు అనుగుణంగా వారి ప్రవర్తన కనిపిస్తున్నది. దుర్యోధనుడు ఉద్ధతుడు, అర్జునుడు వినయశీలి. దుర్యోధనుడు కృష్ణుని మానవమాత్రునిగానే భావించినవాడు. అర్జునుడు కృష్ణుడిని భగవంతునిగా భావించినవాడు. దుర్యోధనుడు తన దృక్పథాన్ని అనుసరించి తల వద్ద నున్న ఉన్నతాసనంపై కూర్చొనడం వల్ల తలనుండి కాళ్ల వరకు చూస్తున్నాడు. అర్జునుడు తన దృక్పథాన్ని అనుసరించి పాదాల వద్ద నిలుచుని యుండడం కారణంగా పాదాల నుండి తలవైపు చూస్తున్నాడు.

సాధారణంగా మానవ మాత్రుల దర్శనం తల నుండి పాదాల వరకు (అవరోహణ కాబట్టి) అవుతుంది... దేవతల దర్శనం, వారు అవతరిస్తారు కాబట్టి పాదాలు ముందుగా కనిపించి తదుపరి తల కనిపిస్తుంది. వారి వారి భావనలను అనుసరించి దుర్యోధన, అర్జునుల భావన ఇక్కడ ప్రతిబింబించిందని భావించవచ్చు.

ఇక కృష్ణుడు మేలుకున్నాడు. ముందుగా అర్జునుని "ఆలోకించాడు". వెంటనే దుర్యోధనుని "చూచాడు". పైకి చూస్తే రెండూ ఒకటిగానే కనిపించినా ఆలోకించడానికి చూడడానికి మధ్య భేదం ఉంటుంది. తిక్కన గారు "ఆలోకించి" (లోతుగా పరిశీలించడం, దర్శించడం) అనే పదాన్ని, "గని" (సాధారణంగా చూచి) అనే పదాలను సాభిప్రాయాలుగానే వేరువేరుగా ప్రయోగించారని భావించవచ్చు. అయితే ఆ భేదాన్ని ప్రవర్తనలో కనిపించనీయకుండా కృష్ణుడు ప్రసన్నతతో కప్పిపుచ్చాడు. ఎందుకు? వచ్చిన వారు ఇరువురూ తనకు ఆప్తులే.. భేదభావన చూపుతున్నట్లు కనిపించకూడదు కాబట్టి ఇరువురికీ ప్రీతిని కలిగించాడు. జగన్నాటక సూత్రధారికి ఇది అసాధ్యమూ కాదు కదా?

వ్యక్తి వ్యక్తిత్వాన్ని వ్యక్తిమత్వంగా (వ్యక్తిత్వ పరిణతి లేదా పరిప-

క్వత) మలిచేది అవకాశాలు కావు, వ్యక్తి ప్రవర్తనయే. దుర్యోధనుని, అర్జునుని రాకలోని అవసరాలు ఒకటే. ఇరువురూ వెళ్ళిన వ్యక్తులూ వేరువేరు కాదు. ఒకరి వద్దకే. అయినా, వారు ప్రవర్తించిన విధానాలు వేరుగా ఉన్నాయి. దీనిని బట్టి "పరిస్థితులు మనిషిని గొప్పవాడిని చేయవు... ఆ పరిస్థితుల్లో వ్యక్తి ఎలా ప్రవర్తిస్తాడో అదే అతని వ్యక్తిత్వాన్ని తెలియజేస్తుంది, అనే సార్వకాలిక సత్యం ఆవిష్కృతమౌతుంది.

వస్త్రధారణ, వర్చస్సు, వచస్సు, విద్య.. ఇవి ఎంత గొప్పగా ఉన్నా వినయం లేకపోతే విజయం వరించదు. వినయశీలత ఎదుటివారి దృష్టిని ఆకర్షిస్తుంది. పాదాల వద్ద నిలుచొని యుండడం మూలంగా కృష్ణుడు కళ్లు తెరిచిన వెంటనే అర్జునుడు కనిపించాడు. దీనిని కేవలం పాదాల వద్ద ఉన్నాడు కాబట్టి ముందుగా చూచాడు అనలేము. అతని వినయమే అతని పట్ల కృష్ణుని దృష్టిని ఆకర్షించిందని చెప్పవచ్చు. నిజానికి వినయం అనేది అవకాశాలను అడగదు... వినయం అర్హతను ప్రసాదిస్తుంది. అర్హత అవకాశాలను అనుగ్రహిస్తుంది.

దుర్యోధనుడు ఉన్నతాసనాన్ని ఎంచుకున్నాడు.. ఉన్నతమైన స్థానాన్ని తనకు తానై ఆక్రమించడం వల్ల ఉన్నతత్వం రాదు. ఉన్నతమైన భావన కలిగి ఉండడమే నిజమైన ఉన్నతత్వం. పదవి కంటే విలువ గొప్పది. "నేనే" అనుకున్న దుర్యోధనుడు... "నేనూ" అనుకున్న అర్జునుడు.. ఇరువురి మధ్య భేదాన్ని.. ఫలితాన్ని ఈ చిన్న పద్యం ద్వారా తెలియచేసాడు, తిక్కన గారు. "నేనే" అనే భావన అహంకారానికి ప్రతీక కాగా "నేనూ" అనే భావన సహజమైన వినయానికి ప్రతీక.

కృష్ణుడు ముందుగా అర్జునుని ఆలోకించినా, దుర్యోధనుని కూడా తగిన గౌరవంతో ఆదరించాడు. వ్యక్తిగత అభిప్రాయాలు ఉన్నప్పటికీ, బాధ్యతాయుత స్థానంలో ఉన్న నాయకునిలో సమదృష్టి అవసరం. కాబట్టి ఇరువురికీ ప్రీతిని కలిగించాడు.. ప్రసన్నులను చేసాడు.

ఈనాటి నాయకుల పరిపాలనలోనూ, న్యాయవ్యవస్థలోనూ, సంస్థల నాయకత్వ ప్రదర్శనలోనూ ఈ విధానం ప్రతిబింబిస్తే వారికి విజయం లభిస్తుంది.

ఇతరుల పట్ల మన భావనలను అనుసరించి వారిపై మన దృష్టి ఉంటుంది. సమాజంలో ఇతరుల పట్ల మన దృష్టికోణమే ఎదుటివారితో మన సంబంధాలను నిర్ణయిస్తుంది. నిజానికి కృష్ణుడు ఇరువురి మధ్య వ్యక్తిత్వంలోని భేదాన్ని గ్రహించినా, భేదభావాన్ని ప్రదర్శించకపోవడం వల్ల ఇరువురూ ప్రసన్నులయ్యారు. కృష్ణునికి ఇరువురి స్వభావాలు బాగా తెలుసు. అయినా తన ప్రవర్తనలో పక్షపాతం కనబడనీయలేదు. ఇది ఈనాడు ప్రతి కుటుంబాలలోనూ, విద్యాసంస్థలలోనూ, కార్యాలయాలలోనూ ప్రతి నాయకుడు, గురువు, తల్లిదండ్రులు అలవరచుకుంటే ఇల్లైనా కార్యాలయాలైనా ఆరామాల వలే ప్రశాంతత నిస్తాయి.

నిజానికి ఈ ఘట్టం కేవలం మహాభారత కథలోని ఒక సంఘటన. తిక్కన గారు తమ శైలిలో రసావిష్కరణ చేయగా ఆ పిదప తిరుపతి వేంకటకవులు దీనిని రసాత్మకంగా, నాటకీయంగా పండిత పామర రంజకంగా తీర్చిదిద్దారు. నేను సాహిత్య కోణం కన్నా వ్యక్తిత్వాన్ని, వ్యక్తిమత్వంగా తీర్చి దిద్దుకునే కోణంపై ఆధారపడి వ్యాఖ్యను చేస్తున్నాను. వ్యక్తి వ్యక్తిత్వాన్ని అతని స్థానం కాదు, అతని సంస్కారం నిర్ణయిస్తుంది. నాయకత్వ లక్షణాలు అధికారంతో రావు, ఎదుటివారితో వ్యక్తి స్పందించే వ్యక్తిత్వంలో ఆవిష్కృతమౌతాయి. సమదృష్టి లేని వ్యక్తులకు అవకాశాలు వచ్చినా అవి వారి స్థానాన్ని ఉన్నతీకరించవు. ఆధ్యాత్మికంగా మరొక్కమాట... దైవానుగ్రహాన్ని పొందడానికి హంగులు, ఆర్భాటాలు కావు.. వినయం, సౌశీల్యం మాత్రమే ఉపకరణాలు అనేది ఈ పద్యాలలో నిరూపితమయింది. అదే సమాజానికి ఈ పద్యాలు ఇచ్చే శాశ్వత సందేశం లేదా మహోపదేశంగా భావించాలి.

నిజానికి సాహిత్యాన్ని జీవితానికి అన్వయించుకున్నప్పుడు, అక్షరాలు పుస్తకంలో మాయమై... మన ప్రవర్తనలోనికి వస్తాయని విశ్వసిస్తూ...

నమస్సులతో...

# శ్రావణ మాసం - పండుగలు



శ్రీహరికి ఇష్టమైన, విష్ణువు జన్మ నక్షత్రమైన శ్రావణ మాసం

## వరలక్ష్మి వ్రతం

శ్రీ హరికి ఇష్టమైన, పైగా శ్రీహరి జన్మ నక్షత్రమైన శ్రవణం పేరిట వచ్చే శ్రావణ మాసంలో ఈ వ్రతాన్ని చేస్తే విశేష ఫలితాలు లభిస్తాయంటారు. సర్వ మంగళ సంప్రాప్తి కోసం సకలాభీష్టాల కోసం నిత్య సుమంగళిగా తాము వర్ధిల్లాలని పుణ్య స్త్రీలు ఈ వ్రతం చేస్తారు.

శ్రావణ మాసంలో పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారం లేదా రెండో శుక్రవారం నాడు వరలక్ష్మీ వ్రతాన్ని జరుపుకుంటారు. మహిళలు దీర్ఘ సుమంగళిగా ఉండేందుకు ఈ వ్రతం ఆచరించడం తప్పనిసరి. అంతే కాదు సిరుల తల్లి లక్ష్మీ దేవిని పూజించడం వల్ల అష్టైశ్వర్యాలు లభిస్తాయని హిందువుల నమ్మకం.

శుక్రవారం నాడు ఉదయాన్నే లేచి, వారి వారి కుటుంబ సంప్రదాయాల కనుగుణంగా కొందరు కొబ్బరి కాయను వరలక్ష్మి దేవిగా అలంకరించి, పూజ చేసి, పిండి వంటలు వండి నైవేద్యం పెడతారు. సాయంత్రం ముత్తైదువులను పిలిచి, శనగలు, తాంబూలం ఇచ్చి అమ్మవారి మీద పాటలు పాడుకుంటూ ఎంతో భక్తిగా సంబరంగా గడుపుతారు. మరి కొందరు వరలక్ష్మీ దేవికి చీర కట్టి, ఆభరణాలతో అలంకరించి, పూజ చేసి, తొమ్మిది రకాల పిండి వంటలు చేసి, నైవేద్యం పెట్టి, సాయంత్రం ముత్తైదువులను పేరంటానికి పిలుస్తారు.

ఈ విధంగా రకరకాల పద్ధతులలో, వారి వారి ఆచార, సంప్రదాయాల కనుగుణంగా వరలక్ష్మీ వ్రతాన్ని జరుపుకుంటారు .

## రక్షా బంధన్

రక్షా బంధన్ అనేది అన్న చెల్లెళ్ళ అనుబంధానికి గుర్తు.

రాఖీ పండుగ నాడు కట్టే రాఖీ ప్రేమ, భద్రత, విశ్వాసం వంటి విలువలను గుర్తు చేస్తుంది.

ప్రతి సంవత్సరం అన్నా చెల్లెళ్ళ అనుబంధానికి గుర్తుగా రక్షా బంధన్ జరుపుకుంటారు. శ్రావణ మాసంలో వచ్చే పౌర్ణమికి రాఖీ పౌర్ణమి అని, రక్షా బంధన్ అని అంటారు. 15 రోజుల ముందు నుండే హడావిడి మొదలవుతుంది. షాపుల్లో రాఖీలు రకరకాల డిజైన్లలో అమ్ముతారు. రక్షా బంధన్ అనేది రాక్షసుల నుండి కాపాడడం కోసమే. ఇది రాఖీ పండుగగా ప్రాచుర్యం పొందింది . అన్నాచెల్లెళ్లకు ఎటువంటి మనస్పర్థలు ఉన్నా, కనీసం ఈ పండక్కైనా మనస్పర్థలు తొలగిపోయి, కలిసి మెలిసి మెలగాలని రాఖీ పండుగ యొక్క ముఖ్య ఉద్దేశం.

రాఖీ పౌర్ణమి హిందూ సాంప్రదాయంలో ఒక ముఖ్యమైన పండుగ. ఈ పండుగను సోదర సోదరీమణుల మధ్య ఉన్న ప్రేమ బంధానికి గుర్తుగా జరుపుకుం-




టారు. రాఖీ పండుగను ఎందుకు జరుపుకుంటారు అంటే రాఖీ అనే దారాన్ని అక్క లేదా చెల్లెలు తన సోదరుడి చేతికి కడుతుంది. ఇది ఒక రక్షణ దారం. దీని వలన తన సోదరుడు సుఖంగా ఉండాలని, ఆయుష్మంతుడు గా ఉండాలని మనస్ఫూర్తిగా ఆశిస్తారు అక్కాచెల్లెళ్లు. అన్నయ్య తన చెల్లెలును ఎప్పుడూ రక్షిస్తానని, ఎటువంటి కష్టాలను దరిచేరనివ్వకుండా చూస్తాడని చెల్లెళ్లకు నమ్మకం అని అంటారు.

ద్విజులకు ఎంతో ముఖ్యమైన పండుగ జంధ్యాల పౌర్ణమి !

శ్రావణ మాసంలో వచ్చే పౌర్ణమి అంటే అందరికీ రాఖీ పండుగ గుర్తుకు వస్తుంది అయితే హిందూ ధర్మంలో చాలా మంది జంధ్యాన్ని ధరించే వారికి శ్రావణ పౌర్ణమి అంటే జంధ్యాల పౌర్ణమి అని కూడా తెలుసు ఉపనయనం సమయంలో ధరించే జంధ్యాన్ని ప్రతి సంవత్సరం శ్రావణ పౌర్ణమి రోజున పాత జంధ్యాన్ని తీసి, కొత్త జంధ్యానికి కుంకుమ పెట్టి, గాయత్రి పూజ చేసి కొత్త జంధ్యం ధరిస్తారు. దీన్ని ఉప కర్మ అంటారు. ఉప కర్మను యజ్ఞోపవీతం పేరుతో పిలుస్తారు.

యజ్ఞోపవీతం అంటే యాగ కర్మతో పునీతమైన దారం అని అర్థం. తెలుగు సాహిత్యంలో ఎంతో పేరెన్నిక గన్న కవి పాల్కురికి సోమనాథుడు శ్రావణ పౌర్ణమిని నూలి పౌర్ణమి అని అభివర్ణించారు. మునుపటి కాలంలో బ్రాహ్మణులు వారి ఖాళీ




సమయాలలో అరుగుల మీద నిలబడి నూలు కండెలలో ఉన్న దారంతో జంధ్యాన్ని వడికే వారు. ఇలా వాడిన జంధ్యాలను జంధ్యాల పౌర్ణమికి అందరూ జంధ్యాన్ని మార్చుకునే వారు. ఉపనయనం జరిగిన వారు మాత్రమే వేదాధ్యయనానికి అర్హులు. అటువంటి వారంతా ఈ జంధ్యాన్ని ధరించే వారు. దీన్ని యజ్ఞోపవీతం అంటారు. ఈ యజ్ఞోపవీతాన్ని ధరించిన వారిని ద్విజులు అంటారు. ద్విజులు అంటే రెండు జన్మలు కలవారు అని అర్థం. అంటే మరణించి మళ్ళీ జన్మించడం కాదు. తల్లి గర్భం నుంచి జన్మించడం మొదటిది అయితే, ఉపనయనం తరువాత గురువు సమక్షంలో యజ్ఞోపవీతానికి జింక చర్మాన్ని కడతారు. దీనిని ఉప కర్మ కార్యక్రమంలో శ్రావణ పౌర్ణమి రోజున వదిలి పెడతారు.

జంధ్యం గురించి చాలామందికి సరిగ్గా తెలియదు. పరిపక్వతకు పరిశుద్ధతకు యజ్ఞోపవీతం దివ్యౌషధం. ఇది ఉపనయన సంస్కారం ఉన్న వారికే పరిమితమైనా, మిగతావారు కూడా అష్టోత్తరాలతో గాయత్రి దేవిని పూజిస్తే సకల శుభాలు కలుగుతాయి. గాయత్రి దేవిని పూజిస్తే వేదాలను పూజించినంత పుణ్యం లభిస్తుందని చెబుతారు.

పెళ్లి కాని వారు మూడు పోగుల జంధ్యాన్ని, పెళ్లి అయిన వాళ్ళు తొమ్మిది పోగుల జంధ్యాన్ని మూడు ముడులు ఉన్న జంధ్యాన్ని ధరిస్తారు. శ్రావణ మాసంలో వచ్చే పౌర్ణమి రోజు ఉపనయనం జరిగిన ప్రతి బ్రాహ్మణుడు జంధ్యాన్ని మార్చుకోవడం జరుగుతుంది. కొత్తగా ఉపనయనం అయిన వారికి హోమం, పూజలతో కార్యక్రమం నిర్వహించి జంధ్యాన్ని మారుస్తారు. దీనినే ఉప కర్మ అంటారు.


# ఆంధ్ర విశ్వ విద్యాలయం



( ఇప్పటికి ఆంధ్ర విశ్వ విద్యాలయం స్థాపించి వంద సంవత్సరాలు అయింది. ఈ సందర్భంగా ఈ ప్రత్యేక వ్యాసాన్ని ప్రచురిస్తున్నాము . సం.)

1913 లో తెలుగు వారు నిద్రలేచి తమకు ప్రత్యేక రాష్ట్రం కావాలని ఉద్యమాన్ని ప్రారంభించారు. అదే సమయంలో ఆంధ్రులకి ప్రత్యేక విశ్వ విద్యాలయం కావాలనే ఉద్యమం కూడా ప్రారంభమయింది .1920 ప్రాంతంలో ప్రతి భాషా ప్రాంతానికి ఒక విశ్వ విద్యాలయం అవసరం అని మద్రాసు విశ్వ విద్యాలయం సెనేట్ ఒక తీర్మానం చేసింది.1919 లో శ్యాడర్ల కమిటీ ప్రాంతీయ విశ్వ విద్యాలయాలు అవసరం అని సూచింది. అప్పటి ప్రభుత్వం అంతగా స్పందించలేదు .1923లో ఆర్.ఎమ్. స్టాథామ్ ఆంధ్ర ప్రాంతానికి ఒక విశ్వ విద్యాలయం అవసరం అని మరొకసారి పునరుద్ఘాటించారు. ఆంధ్రోద్యమం తీవ్రం అవడంతో ప్రభుత్వం ఆంధ్ర విశ్వ విద్యాలయాన్ని స్థాపించాలని మద్రాసు శాసన సభలో బిల్లు ప్రవేశ పెట్టారు . 1926 ఏప్రియల్ 26 న చట్ట రూపాన్ని పొందింది .ఈ విశ్వ విద్యాలయం పరిధిలో గంజాం దగ్గరనుండి చిత్తూరు వరకు ఉన్న కళాశాలలు వచ్చాయి .

అప్పటి మద్రాసు గవర్నర్ లార్డు గోషెన్ గవర్నర్ ఛాన్సలర్ గాను , బొబ్బిలి రాజా ప్రోఛాన్సలర్ గాను , కట్ట మంచి రామలింగారెడ్డి వైస్ ఛాన్సలర్ గాను , సి.డి.యస్ . చెట్టి, రిజిష్టార్ గాను నియమించ బడ్డారు . 1926



ఆగష్టు 30 వ. తేదీన విజయవాడలో సెనేట్ ప్రథమ సమావేశం జరిగింది .కౌతా రామ మోహన రావు గారు విశ్వ విద్యాలయం ముద్రికను చిత్రించారు.


1927-28 లో డిగ్రీకోర్సులను ప్రవేశ పెట్టారు. అప్పటికి అనంత పురం, రాజమండ్రి, విజయనగరం, బందర్ , నగరాలలో ఫస్టు గ్రేడ్ కళాశాలలు ఉండేవి. విశాఖపట్టణం , పర్లాకిమిడి,కాకినాడ, గుంటూరు , నెల్లూరు, మదనపల్లి, లో సెకండరీ గ్రేడ్ కళాశాలలు ,కొన్ని ఓరియంటల్ కళాశాలలు ఆంధ్ర విశ్వ విద్యాలయం పరిధిలో ఉన్నాయి . 1928 లో మొదటి స్నాతకోత్సవం నిర్వహించారు.ఆ సభలో డా. సర్వే పల్లి రాధా కృష్ణన్ గారు స్నాతకోపన్యాసం చేసారు. తరువాత రామ లింగారెడ్డిగారు మరో మూడు సంవత్సరాలు వైస్ ఛాన్సలర్ గా ఉన్నారు.

అప్పటి ముఖ్య మంత్రి సుబ్బరాయన్ విశ్వవిద్యాలయం విశాఖ పట్టణంలో పెట్టాలని ప్రతిపాదించారు. కట్టమంచి రామలింగారెడ్డి, కడప కోటి రెడ్డి గారు ఈ ప్రతిపాదనను బలపరిచారు.రాయల సీమ,కడప, కర్నూలు, చిత్తూరు, బళ్ళారి, అనంతపురం ప్రతినిధులు ఈ ప్రతి పాదనను వ్యతిరేకించి, వారి ప్రాంతం కళాశాలలను ఆంధ్ర విశ్వ విద్యాలయం పరిధి నుంచి తొలగించి, మద్రాసు విశ్వ విద్యాలయంలో కలుపుకున్నారు. ( తరువాత వేంకటేశ్వరా విశ్వ విద్యాలయంలో కలిపారు ). 5-9-1930న వాల్తేరులోని హోటల్ సెరిల్ లో ఆంధ్ర విశ్వ విద్యాలయం కార్యాలయం ప్రారంభమయింది. 1931లో సి.ఆర్.రెడ్డి గారు ఆంధ్ర విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ పదవికి రాజీనామా

చేసారు. తరువాత రాధాకృష్ణన్ గారు ఆంధ్ర విశ్వ విద్యాలయానికి ఉపాదక్షులుగా నియమింప బడ్డారు .

ఆ రోజులలో ఆంధ్ర విశ్వ విద్యాలయంలో ఎం. ఎ., ఎం.ఎస్.సి వంటి డిగ్రీలు మద్రాసు, బెనారస్, కలకత్తా విశ్వ విద్యాలయాలలో చదవ వలసి వచ్చేది. రాధాకృష్ణన్ గారు ఆంధ్ర విశ్వ విశ్వ విద్యాలయంలో బి.ఎ,బి.ఎస్ .సి ఆనర్సు కోర్సులు ప్రవేశ పెట్టారు. అలాగే కామర్సు కోర్సులో ఆనర్సు కోర్సును మొదటి సారిగా ఇక్కడ ప్రవేశ పెట్టారు . 1931-33 లో అర్ట్సు, సైన్సు, టెక్నాలజీ కోర్సులకు భవనాలు, హాస్టల్ భవనాలు నిర్మించారు .1936 లో రామలింగా రెడ్డి గారు తిరిగి వైస్ ఛాన్సలర్ గా వచ్చారు. వీరి హయాంలో 1941 వరకు విశ్వ విద్యాలయంలో వివిధ భవనాలు నిర్మించ బడ్డాయి. కొన్ని కొత్త కళాశాలకు ఆ సమయంలో అనుమతి ఇవ్వబడింది . బోధన, పరిశోధన రంగాలకు మెరుగులు దిద్దబడ్డాయి .

1942లో రెండవ ప్రపంచ యుధం జరిగింది . విశాఖపట్టణం మీద జపాన్ బాంబును వేసింది. ఆ సమయంలో విశ్వ విద్యా లయాన్ని విశాఖ పట్టణం నుండి గుంటూరు మార్చారు. యుద్ధానంతరం 1946లొ విశ్వ విద్యాలయాన్ని తిరిగి విశాఖ పట్టణం మార్చారు . తరువాత సి.ఆర్. రెడ్డి గారు మైసూరు విశ్వ విద్యాలయానికి ప్రో ఛాన్సలర్ గా వెళ్లి పోయారు. వి.యస్.




కృష్ణ గారు వైస్ ఛాన్సలర్ గా నియమింపబడ్డారు . జయపూర్ మహారాజు గారు ప్రో ఛాన్సలర్ గా నియమింపబడ్డారు . వీరు విశ్వ విద్యాలయానికి ఉదారంగా విరాళాలు ఇచ్చారు.

1928లో గ్రంధాలయం ప్రారంభించ బడింది . ఈ విశ్వ విశ్వ విద్యాలయానికి గ్రాంట్ ఇచ్చే విషయంలో ఆనాటి ప్రభుత్వాలు ఉదాసీనత వహించాయి . మన విశ్వ విద్యాలయానికి 4,63, 100 రూ. గ్రాంటుగా మద్రాసు ప్రభుత్వం ఇచ్చింది. ఆరోజులలో బొబ్బిలి రాజావారు సంస్కృతాంధ్ర విద్యలకు లక్ష రూపాయలు దానంగా ఇచ్చారు . విక్రమదేవ వర్మగారు సంవత్సరానికి ఇంత అని ఇచ్చారు . అలాగే తిరువాన్కూరు మహారాజు , నైజాం నవాబ్ , పెద్ద మొత్తాలలో దానం చేసారు .

1953 లో ఆంధ్ర విశ్వ విద్యాలయం రజతోత్సవం జరుపుకొంది . ఆ నాటికిఉపాధ్యక్షులుగా ఉన్న సర్వేపల్లి రాధా కృష్ణన్ గారు రజతోత్సవానికి అధ్యక్షులుగా వచ్చారు .ఇక్కడ మరోక విషయాన్ని గుర్తించాలి . 2026లో విశ్వ విద్యాలయం జరుపుకుంటున్న శతాబ్ది ఉత్సవాలకి , విశ్వ విద్యాల యం విద్యార్ధి . విద్యార్ధి నాయకుడు, మాజీ ఉప రాష్ట్రపతి అయిన శ్రీ వెంకయ్య నాయుడుగారు అధ్యక్షులుగా వచ్చారు . ఈ విశ్వ విద్యాలయం ఇద్దరు ఉపాధ్యక్షు లను అందించింది . శాస్త్ర వేత్తలు , ఇంజనీర్లు , బాషా పండితులకు లెక్కలేదు.

మద్రాసు గవర్నర్ శ్రీ ప్రకాశన్ వైస్ ఛాన్సలర్ గాను , బెజవాడ గోపాలరెడ్డి గారు ప్రో ఛాన్సలర్ గాను , వి.ఎస్. కృష్ణ గారు ,వైస్ ఛాన్సలర్ గాను ,శ్రీ . కూర్మా వేణు గోపాల స్వామి గారు రిజిష్టార్ గాను విశ్వ విద్యాలయాన్ని మరింత అభివృద్ధి పరిచారు . ఈ విధంగా ఆంధ్ర విశ్వ విద్యాలయం సమర్ధులైన ఛాన్సలర్ ల చేతిలోను , నిష్ణాతులైన ప్రొఫెసర్ల బోధతోను దిన దినాభి వృద్ధి చెంది నేటికి శతాబ్ది ఉత్సవాన్ని జరుపుకుంటోంది .

( 1981 లో లో ఆంధ్ర విశ్వ విద్యాలయంలో జరిగిన శ్రీ. కట్టమంచి రామలింగారెడ్డి శతజయంత్సువ సభకు ఈ వ్యాస రచయిత ప్రత్యేక ఆహ్వానితుడుగా పాల్గొన్న సమయంలో శ్రీ బెజవాడ గోపాలరెడ్డి, శ్రీ ఎం. ఆర్. అప్పారావు గారితో జరిపిన ఇష్టా గోష్టి లోని విషయాలను, అనేక గ్రంధాలలోని విషయ సేకరణతోను ఈ వ్యాసం రచింప బడింది ).

అడవి లో ఋషులు ఆశ్రమాలు దర్శించు కుంటూ కాలం గడుపు తుంటే ఒక నాడు శూర్పణ మేము ఉంటున్న చోటుకు వచ్చి నన్ను చూసి పెళ్ళి చేసుకోమని అడుగగా నాకు వివాహం అయ్యింది అన్నా ను .నీ భార్య ను నేను చంపి తినేస్తా అప్పుడు నీవు నన్ను వివాహం చేసుకోవచ్చు ...అంటూ వడివడి గా సీతమ్మ చెంతకు శూర్పణఖ చేరే ప్రయత్నం చేస్తుంటే నేను లక్ష్మణున కు సైగ చేయగా లక్ష్మణుడు శూర్పణఖ ముక్కు చెవులు కోసి పంపాడు.

ఆమె కోపం దుఃఖం రెండింటితో ఆమె అన్న రావణుని. చెంతకు వెళ్ళి ఆయన తో రామచంద్రుని భార్య చాలా అందగత్తె అటువంటి అందం ఈభూమి మీద నేను ఎక్కడ చూడలేదు . అంతటి అందగత్తె ను నీకోసం తీసుకొని వద్దామని వెళ్ళానని ఈ కారణంగా నా ముక్కు చెవులు కోల్పోయానని. తెలియజేసింది. స్త్రీ వ్యసనం గల రావణుడు మారీచుని సహకారంతో సీతమ్మను పొందాలని భావించి మారీచుని బంగారు లేడిగా మారి సీతమ్మ ఉన్న చోటుకు వెళ్ళి ఆమెను ఆకర్షించే విధంగా ప్రవర్తించ మనగా మారీచుడు రావణుడు చెప్పి నట్లే చేశాడు. ఆబంగారు లేడి నాకు కావాలని సీతమ్మ కోరగా అది బంగారు లేడి కాదు. వాడు మారీచుడు అని లక్ష్మణుడు చెప్పాడు. అయినా సీతమ్మ వినలేదు. పైగా నేను నిన్ను అడగలేదు మా ఆయన్ని అడిగానంది .నాకు వాడు మారీచుడు అని తెలిసినా గతంలో ఒకనాడు అగస్త్యమహర్షి నాతో సీతమ్మ నీతో కూడా వచ్చి నీతో సమానంగా అన్ని కష్టాలు పడుతోంది.గాన సీతమ్మ ఏది కోరినా కాదన వద్దని నాతో చెప్పారు .ఆ కారణంగా నేను ఆమెతో మాట్లాడలేకపోయాను. లక్ష్మణుని సీతమ్మ చెంత కాపలా ఉంచి నేను ఆబంగారు లేడి కోసం వెళ్ళి అది అందక పోవడం తో బాణంతో కొట్టగా చనిపోతూ హా..లక్ష్మణా...హాసీతా... అంటూ అరిచి మారీచుడు మరణించాడు.సీతమ్మ రామచంద్రుని కి అపాయం కలిగిందేమోనని కంగారుపడి లక్ష్మణుని వెళ్ళమని చెప్పగా అది మా అన్నగారి కంఠం కాదు . కంగారు పడవద్దని చెప్పగా సీతమ్మ కోపంతో లక్ష్మణుని తో భరతుడు రాజ్యం కోసంచూశాడు... నువ్వు నాకోసం చూస్తున్నావా నేను చావనైనా చస్తాను గాని నీకు దొరకను అంటూ దూషిస్తూ నీవు వెళతావా నన్ను చనిపో మంటావా .....అనగా లక్ష్మణుడు అక్కడ నుండి బయలుదేరి నా చెంతకు వచ్చాడు ఈలోగా సీతమ్మను రావణాసురుడు లంకకు ఎత్తుకు పోతూ ఉంటే జటాయువు సీతమ్మను రక్షించాలని తన శక్తి వంచన లేకుండా పోరాడి చివరకు అతని చేతిలో మరణించాడు.రావణుడు సీతమ్మను లంకకు తీసుకొని పోతూ ఉండగా సీతమ్మ దేవతల కంట బడింది. (దేవతలు అంతా రావణుని తపస్సు కు మెచ్చి వారాలు ఇచ్చి అతనికి బానిసలు గా మారారు ) వారంతా కలసి సీతమ్మను రక్షించాలని భావించి కొంతమంది దేవతలు రావణునితో ధైర్యంగా ఈమె సీత కాదు.వారు ఉంటున్న ఆశ్రమంలో రాముడు, లక్ష్మణుడు ఆశ్రమంలో లేని. సమయంలో సీతమ్మ అగ్ని హోత్రుని సంరక్షణలో ఉంటుంది.వెళ్ళి అగ్ని హోత్రుని అడగ మన్నారు అగ్ని హోత్రుని అడుగగా భయంభయంగా ఈమె యే సీతమ్మ అని వేదవతి ని రావణునకు అప్పగించగా రావణుడు వదలిన అసలు సీతను అగ్ని హోత్రుడు తన చెంత జాగ్రత్త పెట్టాడు.రావణ సంహారం తదనంతరం వేదవతి ని నా భార్యగా భావించి అలంకరించి తీసుకొని రాగా నా భార్య కాదు గాన ఆమె కేసి నేను చూడలేదు. ఈవిషయం వేదవతి గమనించి ఆమె అగ్ని లో కి వెళ్ళి అసలు

సీతను బయటకు పంపింది. ఆసమయంలో సీతమ్మ నాతో వేదవతి తనను రక్షించింది పైగా ఆమె మిమ్ములను కోరుకుంటోంది గాన ఆమె ను మీరు వివాహం చేసుకో మని పట్టు పట్టింది . నేను రామావతార కా ఏకపత్నీ వ్రతుడను గాన మరొక అవతారం లో తప్పనిసరిగా వివాహం సుకుంటానని చెప్పాను.ఆమె యే పద్మావతి. మా ఇరువురి వివాహం నీ చేతుల మీదుగా జరగాలి.అన్నారు.

కలియుగ ప్రత్యక్షదైవం శ్రీ వేంకటేశ్వరుడు...18వ భాగం

శ్రీ నివాసా ముందు గా నీవు లేచి భోజనం చేయాలి తదుపరి పద్మావతి వాళ్ళ పెద్దలతో నేను వెళ్ళి మాట్లాడి వస్తానని శ్రీ నివాసునకు హామీ ఇచ్చింది.శ్రీనివాసుడు

తృప్తి గా భోజనం చేసి ఆనందంగా బయటకు వెళ్ళాడు . .తరువాత వకుళమాలిక తానుకూడా భుజించి తగినవిధంగా తన అలంకరణాది కార్యక్రమములు ముగించుకొని శ్రీ నివాసా ఆకాశరాజు ఇంటి కి వెళ్ళాలంటే ఎలా వెళ్ళాలో తెలియజేయ మని కోరింది.ఆయన తెలియజేయగా ఒక గుర్రం పై బయలుదేరింది.శ్రీనివాసుడు చెప్పిన విధంగా పర్వతము నుండి దిగి కపిలేశ్వర స్వామి క్షేత్రం ముందుకు చేరి అక్కడున్న పుష్కరిణిలో స్నానమాచరించి కపిలేశ్వర స్వామి ని దర్శించి మా శ్రీనివాసుడు కోరుకున్న పద్మావతి తో అతనికి కల్యాణం జరిపించమని ప్రార్ధించింది.అక్కడ నుండి పద్మసరోవర తీరము నకు చేరి వికసించిన తామర పద్మములతో బలరామకృష్ణుల ను భక్తి తో సేవించి తదుపరి సువర్ణముఖరీ నదిని సేవించి అగస్త్యేస్వరుని. ఆలయము చేరి ఆలయంలో ఉన్న స్వామిని అక్కడ ఉన్న పెద్దలను దర్శించాలని గుర్రం దిగి పాద ప్రక్షాళన గావించు కుని ఆలయం లోపలికి వకుళమాలిక ప్రవేశించ గా అంతా

హడావిడిగా ఉంది.అక్కడ ఉన్నవారిలో ఒకామె తో వకుళమాలిక అమ్మా మీరు ఎవరు?అని ప్రశ్నించగా మేము ఆకాశరాజు కుమార్తె పద్మావతి పరిచారకులము.మేము అంతా మా యువరాణి పద్మావతి తో తోటలో ఉండగా మంచి అందమైన యువకుడు కిరాత వేషంలో మా యువరాణి కి కనిపించాడు. అతన్ని చూసి మా యువరాణి భయపడి మూర్ఛపోయింది. మామహా రాజుకు ఈవిషయం తెలియ జేయగా ఈ అగస్త్యేశ్వర స్వామి కి అభిషేకము చేయించమని ఆజ్ఞాపించి నందున మేము వచ్చి అభిషేకము చేయించు చున్నాము..అనగా వకుళమాలిక వారిలో కిరాతరూపం ధరించిన అందగాడా...మీరు చూశారా .... అంటూ కొంచెం వివరంగా చెప్పమని వారిని కోరింది. మేము మా రాకుమార్తె పద్మావతి తో కలిసి ఒక రోజు ఉద్యాన వనమున పువ్వులు కోయుచుండగా అక్కడికి ఒక సుందర పురుషుడు అందమైన గుర్రముపై నెక్కివచ్చి మేము మీతో చెప్పుకోలేని మాటలు మాట్లాడినాడు . ఆ మాటలకు మా పద్మావతి అతని పై కోపం తో జాగర్తగా మాట్లాడమని హెచ్చరించింది. అయినా వినక అదేవిధంగా మాట్లాడు తూఉంటే మేమంతా రాళ్ళు విసరగా అతని గుర్రం నేలపై పడి పోయింది.దాంతో అతను బాధపడుతూ ఉత్తర దిశగా వెడలిపోయాడు.కిరాత రూపంలో నున్న ఆ పురుషుడు అక్కడ నుండి వెళ్ళగానే పద్మావతి కి మూర్ఛవచ్చి నేలపై పడింది. ఆసమయంలో ఆమెను పల్లకి ఎక్కించి ఆకాశరాజు గారి ఇంటికి తీసుకుని వచ్చాము.ఆకాశరాజు ఆమెను చూసి కంట తడి పెట్టుకుంటూ దేవగురువగు బృహస్పతి తన కుమార్తె కు తగిన వైద్యుడు గా భావించి వారి చెంతకు తన కుమారుని పంపి పిలిపించారు.ఆయన పద్మావతి ని పరిశీలించి ఈమె పరాయి పురుషుని చూచి భయపడింది గాన అగస్త్యేస్వరునకు ఏకాదశ రుద్రాభిషేకం జరిపించమని రాజుకు తెలియజేయగా రాజు గారు మమ్ము లను ఆదేశించిన కారణంగా మేము కావలసిన పూజా సామగ్రి తీసుకుని పూజనిర్వహించే భ్రాహ్మణులతో కలసి ఈ ఆలయానికి వచ్చి బృహస్పతి గారు చెప్పిన పూజలు దగ్గర ఉండి చేయిస్తున్నాము. మీ రేమిటి ఇక్కడ ఉన్నారు.

ఎక్కడ నుండి వచ్చారు? ఏపని మీద వచ్చారు? అని యడుగగా వకుళమాలిక చెప్పడం ప్రారంభించింది. నాకు ఆకాశరాజు ధర్మపత్ని ధరణీ దేవితో మాట్లాడే పని యున్నది.మీ రాజ్యమైన "నారాయణపురము"నకు ఇతర దేశీయుల ప్రవేశము ఉంటుందో లేదో, అని మీద్వారావచ్చి ధరణీ దేవి గారి ని కలవాలనుకుంటున్నాను అన్నది.

ఇక్కడ పరిస్థితులు ఇలా ఉండగా శ్రీ నివాసుడు పద్మావతి ని తనకు అనుకూలంగా మార్చమని వకుళమాలిని పంపి మరొక ప్రక్క తానే స్వయంగా "శోదికత్తియ "వేషం వేసుకుని బ్రహ్మను ఏడుమాసముల చంటి పాపగా మార్చి పయిట కొంగుకు చుట్టుకొని ఈశ్వరుని మంత్రదండం గాను,ఈ సర్వజగత్తు ఒక బుట్టగాను , అందు నిండుగా ధాన్యము నింపుకొని తలపై పెట్టుకొని గురివింద గింజల పూసల ఆభరణమును,శంఖముల మాల ,మెడలోధరించి చూచుటకు "సోది త్తియ"వలే శ్రీ నివాసుడు రూపం మార్చుకొని "సోది చెబుతానమ్మ- సోది" అంటూ అరుస్తుంటే ఈవిషయాన్ని పరిచారికలు విని రాజమాతతో చెబుతూ ఈమె మన మనస్సులో ఉండేవిషయాలను అన్నీ తెలియజేస్తుందని తెలుపగా ధరణీ దేవి సోది కత్తయను పిలవమని చెప్పింది. రాణీ గారి పరివారం పిలిచి నా వెళ్లలేదు.ధరణీదేవి స్వయంగా పిలచిన తరువాతే ?"సోదికత్తె" లోపలకు వెళ్ళింది. దరణీదేవి ఆమె కూర్చోవడానికి ఆసనం చూపగా కూర్చుంది. ధరణీదేవి ఆమె తో యదార్ధంగా నా మనస్సులో ఉండే కోరిక ఏమిటో తెలియజేయ మంది సోదికత్తె ఆమె తో జరిగిపోయిన విషయం జరుగుతున్న విషయం జరగబోవు విషయం అన్నీ చెబుతా అంటూ తన మాటల గారడీ తో ధరణీ దేవి కి తన పై తన మాటపైన నమ్మకం కలిగేటట్లు చేసుకుంది.దాంతో సోదికత్తెను తన భవనము లోకి తీసుకొనివెళ్ళి, మంచి పీఠము పై కూర్చుండ బెట్టింది.సోదికత్తె, ధరణీ దేవి తో స్నానం చేసి ఉతికి ఆరవేసిన వస్త్రాలు ధరించి మీ గురువు లకు దేవతలకు, సృష్టికర్త శ్రీ మన్నారాయణునకు నమస్కరించి రమ్మనమంది.వస్తూ వస్తూ దేవత లందరకూ ప్రీతి కలిగే విధంగా నాకు వాయినం తీసుకురమ్మని కోరగా ధరణీ దేవి బంగారు చేటలో మంచి ముత్యాలు , బియ్యం కలిపి తెచ్చింది.సోదికత్తె నా కుమారునికి కొంచెం అన్నం పెట్టమంది.బంగారు పాత్ర తో పాయసం అందించింది.తన కుమారుడు పాయసాన్నం తినక ఏడుస్తుంటే బలవంతంగా తినిపించి తాను కొంచెం తింది.తదుపరి ధరణీ దేవి ని తాంబూలం అడిగింది.ధరణీదేవి తామలపాకులలో ఏలకులు,లవంగాలు, పచ్చకర్పూరం తో కూడిన తాంబూలం అందించారు. సోదికత్తె తాంబూలం వేసుకుని తూర్పు వైపు తిరిగి తన పిల్లవానిని తొడపై కూర్చుండ బెట్టుకుని కాళ్ళు చాపుకొని కూర్చుంది.ఈవిధానాన్ని దేవతలంతా చూస్తూ ఆనందిస్తూ ఉన్నారు.

కలియుగ ప్రత్యక్షదైవం శ్రీ వేంకటేశ్వరుడు...19వ భాగం

శ్రీ నివాసుడు ఒక సోదికత్తె వేషము ను ధరించి మంత్రదండం ,ఒక వెదురు బుట్ట చేత ధరించి ధరణీ దేవి తో మాట్లాడు తుంటే ఆమె పూర్వ జన్మ పుణ్యఫలం గాన ..సాక్షాత్తు .. శ్రీ మన్నారాయణుని తో మాట్లాడే అదృష్టం ధరణీ దేవి కి లభించింది అని బ్రహ్మాది దేవతలు ఆశ్చర్య పోతున్నారు.

సోదికత్తె ముందుగా శ్రీ మన్నారాయణుని, మహాలక్ష్మిని, సకల బ్రహ్మాది దేవతలను, శ్రీ రంగం,ప్రయాగ వంటి దివ్యపుణ్య క్షేత్రాలను, పుణ్యం తీర్థాలను, నదులను తలంచి, ధరణీ దేవి, సోదికత్తెకు తెచ్చి అందించిన చేటలో నున్న మణులను మూడు భాగములుగా సోదికత్తె విభజించి తన మంత్రదండం ధరణీ దేవి చేతికి అందించి ఈమూడు భాగము లలో ఏదోఒక భాగము ను మంత్రదండం తో తాకమని కోరగా ఆమె మధ్య భాగాన్ని తాకగా సోదికత్తె మంత్రదండాన్ని ధరణీ దేవి నుండి తిరిగి తీసుకుని తన చేత ధరించి ఒక్క క్షణం తన

కళ్ళు మూసుకుని ....ఓ దేవీ... నీ కుమార్తె నిన్నటి రోజున ఒక గుర్రం పై స్వారీ చేస్తూ వచ్చిన ఒక దివ్య సుందర పురుషుణ్ణి చూసింది.ఓదేవీ !నేను చేత ధరించే ఈ దండం మీద ,వెదురు బుట్ట మీద ప్రమాణం చేసి చెబుతున్నా ఆ పురుషుడు సాధారణ మానవుడు కాదు. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు,సకల ప్రాణికోటికి తల్లి,తండ్రి మరియు రక్షకుడు అయినే శ్రీ మన్నారాయణ స్వరూపుడైన శ్రీ నివాసుడు గా ఈమె చెంతకు వచ్చి నాడు . పద్మావతీ దేవి సాక్షాత్తు ఆపరమాత్మ నే వరించి భర్త గా పొందాలని కోరుకుంటోంది. ఓదేవీ! .. నామాట అసత్యము కాదు.నీ కుమార్తె కోరిక తప్పక నెరవేరు తుంది.నేను చెప్పిన మాటలు సత్యమని నమ్ముము. అని చెప్పి మరలా పద్మావతి తో నాకు ఏలకులు,లవంగాలు,కర్పూరం,జాపత్రి,వక్కలతో కూడిన తాంబూలం కావాలని కోరగా ధరణీ దేవి ఆమె కోరిన విధంగా తాంబూలం అందించింది.సోదికత్తె మదల ధరణీ దేవి తో సాక్షాత్తు శ్రీ మన్నారాయణుడే మీ కుమార్తె మనస్సును ఆకర్షించాలని కిరాత రూపంలో ఇక్కడ కు వచ్చి ఆమె మనస్సు ను శ్రీ నివాసుని రూపంలో దోచుకోవడం జరిగింది. మీ కుమార్తె పద్మావతి శ్రీ నివాసుని రూపాన్ని మనస్సులో తలుచు కుంటూ ఇతరులకు చెప్పలేక బాధపడుతూ మానసికంగా కృశించుచున్నది.

ఈ సమస్యకు పరిష్కారం మీ కుమార్తె పద్మావతి ని శ్రీ నివాసునకు ఇచ్చి వివాహము జరిపించాలి అని తెలియజేయగా ధరణీ దేవి సోదికత్తె తో నా కుమార్తె కు కనిపించిన కిరాతక వేషధారియగు ఆపురుషోత్తముడు ఎవరు-?ఎక్కడి వాడు? అతని పేరు వివరాలతో తెలియ జేసినచో నీవు అడిగిన దానిని తప్పక ఇచ్చెదనని తెలియజేసింది.

సోదికత్తె ... ధరణీ దేవి తో శ్రీ మన్నారాయణుడు కృష్ణావతారం పూర్తి చేసి పాలకడలి చేరి అక్కడ నుండి శ్రీ నివాసునిగా వేంకటాచలము నందు నివసించు చున్నారు.అతని గుర్రము ను నీ పుత్రిక, ఆమె చెలికత్తెలు కలిసి రాళ్ళతో కొట్టి అచేతనంగా పడి ఉండేటట్లు చేయగా మీ అమ్మాయి పట్ల ఉండే మక్కువ కారణంగా ఏమీ మాట్లాడక ఊరుకున్నాడు. ఈవిషయం మీ కుమార్తె ను, ఆమె చెలికత్తెలనూ ఎవ్వరినైనా అడగ వచ్చు. గాన నీ కుమార్తె ను ఆ శ్రీ నివాసునకు ఇచ్చిన ఆమె సుఖపడును. లేనిచో మరణించును. ఇది సత్యము.అనగా ధరణీ దేవి నీ మాట పట్ల నాకు అంతగా నమ్మకం కలగడం లేదు అనగా ఓ దేవీ.!... నేను చెప్పే మాటలు సత్యమని నమ్ము. అంటూ కాస్త కళ్ళు పెద్దవి చేసి మరీ సోదికత్తె చెప్పింది.ధరణీ దేవి ఆమె తో మా కుమార్తె చూసిన వ్యక్తి ఎవరో మాకు తెలియదు . కనీసం వాళ్ళ మనుషులు ఎవరో ఒకరు వస్తేనే కదా వాళ్ళ వివరాలు మాకు తెలిసేది . అనగా సోదికత్తె కాసేపు కళ్ళ మూసుకుని తెరిచి ధరణీ దేవి తో నేడు ఇరువది నాలుగు నిమిషము లలో ధర్మదీక్షగల ఒక వృద్ధురాలు నీ చెంతకు వచ్చును.నీవు నీ భర్త, నీ భర్త సోదరుడు తొండమానుడు మొదలైన మీ బంధువులు అందరికీ తెలియజేయండి . .అతని కిరాత వేషాన్ని విని అనుమాన పడకండి .మరలా చెబుతున్నా అతడు సాక్షాత్తు శ్రీ మన్నారాయణ స్వరూపుడే ప్రస్తుతం పద్మావతి మనస్సు నిండా శ్రీ నివాసుడే యున్నాడు.అమెతో ఆయనకు వివాహము జరుపక పోతే పద్మావతి బ్రతుకదు.ఇది-సత్యము అనగా ధరణీ దేవి నా కుమార్తె ఎక్కడ ఉన్నా సుఖంగా ఉండాలనే

ఆమె తల్లిదండ్రులు గా మేము కోరుకునేది.నా కుమార్తె కోరుకుంటే తప్పని సరిగా ఆ శ్రీ నివాసునకే ఇచ్చి వివాహం చేస్తాం అని నమ్మకంగా చెప్పి సోదికత్తె కోరిన విధంగా ఆమె ను గౌరవంగా సత్కరించి ఆమెను సాగనంపి ధరణీ దేవి తన కుమార్తె ఉన్న భవనానికి వెళ్ళింది ఎప్పుడూ చలాకీగా తిరుగుతూ ఉండే పద్మావతిని మంచంపై చూడగానే ధరణీ దేవి కి కళ్ళవెంబడీ నీళ్ళు రాగా ఆమె తో అమ్మా ! పద్మావతీ ఎప్పుడూ సంతోషంగా తిరుగుతూ కనిపించే నువ్వు ఇప్పుడు ఇలా అయి పోయా

వేమిటి? నీకు నీ తల్లి ని మించిన స్నేహితురాలు ఎవరుంటారమ్మా. .. నీవు శారీరకంగా లేదా మానసికంగా ఏదైనా బాధపడుతున్నావా! సందేహించకు నీ మనస్సులో ఏదైనా కోరిక ఉందా ! ఆ కోరిక నేను తీర్చలేనని బాధ పడుతున్నావా! ముందు నీ మనస్సులో ఉన్న బాధ ఏమిటో తెలియజేయి ..... నేను నీతో చెప్పను చెప్పలేను అంటావా.. నువ్వు ఇలాగే ఉంటే నిన్ను నేను ఈవిధంగా చూస్తూ బ్రతుక లేను ఏవిషమైన మ్రింగి మరణించాలని ఉంది .అంటూ గట్టిగా వెక్కి వెక్కి ఏడవ సాగింది. పద్మావతి ... ఆమె ను ఓదార్చుతూ .....అమ్మా దుఃఖించకు యదార్ధముగా నా తల్లి తండ్రులకు చెడ్డపేరు తెచ్చే ఏ పని నేను చేయలేదు. ఇది సత్యం . ఇది ఎవ్వరికీ చెప్పుకోలేని విషయం నాది. అయినా నీ వు నా తల్లివి గాన జరిగిన విషయం యదార్ధం గా చెబుతున్నా .నీ అనుమతి తో నేను నా చెలికత్తెలతో పూల ఉద్యాన వన మునకు వెళ్ళితిని అక్కడ తామర రేకులు వంటి నేత్రములు గల అందమైన పురుషుని చూశాను. అతని సుందర నేత్రములు, ముఖము నా మనస్సును ఆకర్షించింది. యదార్ధంగా అతను లేక పోతే నేను బ్రతుక లేను అనిపించింది . ఇది సత్యం.అతని కంఠం పై కౌస్తూభ మణి, చేతులలో శంఖ, చక్రాలు ప్రకాశిస్తున్నాయి. అని ఎంతో ఆనందంగా చెబుతుంటే.. ధరణీ దేవి ఇది



నిజమా! నీ బ్రమా! అంది. పద్మవతి..అమ్మా నేను చెప్పిన విషయం సత్యం.ఈనాటికీ నా నేత్రాలు అతనిని దర్శించాలనే తహ తహ లాడుతున్నాయి. అనగా ధరణీ దేవి పద్మావతి తో కంగారు పడకు నీ మానసిక వేదన తొలగే విధంగా మీ నాన్నగారి తో నేను మాట్లాడుతానని ఆమె తో చెప్పి తన భర్త ఆకాశరాజు ఉన్న భవనం కు వెళ్ళింది.

(ఇంకా ఉంది)

. కలియుగ ప్రత్యక్షదైవం శ్రీ వేంకటేశ్వరుడు -20వ భాగం

ధరణీ దేవి తన భర్త ఆకాశరాజు చెంత కేగి మన కుమార్తె మానసికంగా కృశించుటకు కారణము తెలియక శారీరక అనారోగ్యము గా భావించి మంచి వైద్యుని పిలిపించి అతడు ఇచ్చిన మందులు వాడుతున్నాను. ఒక వేళ దృష్టి దోషము అయి ఉండ వచ్చని తొలగుటకు తగిన క్రియలు జరిపించినాను. అంతేకాదు మన పద్మావతి చెలికత్తెలను అగస్త్యేశ్వర స్వామి ఆలయము నకు పంపి మన కుమార్తె పేరుతో అభిషేకములు, పూజలు జరి పించ మని పంపడం జరిగింది. ఎప్పుడూ లేని విధంగా మన కుమార్తె ఏమీ తినక,త్రగక మంచం పై పడి ఉంటోంది . నేను మన కుమార్తె పరిస్థితి తలుచుకుని ఏమీ తోచక నేను మానసికంగా బాధ పడుతుంటే దైవికంగా ఒక సోదికత్తె రావడం జరిగింది. ఆమె మన పుష్ప ఉద్యానవనం లో మన పద్మావతి కిరాత రూపంలో నున్న ఒక సుందర పురుషుని చూసి వరించిందని అమె మనస్సు పూర్తిగా అతని పై లగ్న మైనందువల్ల వల్ల బెంగతో ఏమీ తినక,త్రాగక అలా ఉందని తెలియజేసింది. తిరిగి నేను పద్మావతి చెంతకు వెళ్ళి ప్రేమతో బ్రతిమాలి అడుగగా సోదికత్తె చెప్పిన విషయాలు మన కుమార్తె చెప్పిన విషయాలు ఒకే విధంగా ఉన్నాయి. అంతేకాదు ఆ సోదికత్తె నాతో సాక్షాత్తు సకల జగత్తుకు సృష్టి, స్థితి,లయ కారకుడు అయిన ఆ పరమాత్మ సుందర కిరాత రూప వేషధారి గా వచ్చి మీ అమ్మాయి మనస్సు పూర్తిగా స్వామి తనను ఆకర్షించే విధంగా చేసు కున్నాడు. మీ అమ్మాయి కి

(ఇంకా ఉంది)

# శ్రీ ఆంజనేయం

## శ్రీ తాడుబందు వీరాంజనేయస్వామి వారు (సికింద్రాబాద్)

అతి ప్రాచీనమైన, పురాణ ప్రసిద్ధి చెందిన మహిమాన్విత ఆలయం ` శ్రీ వీరాంజనేయస్వామి క్షేత్రం. సికింద్రాబాద్‌కు ఐదు కిలోమీటర్ల దూరంలో బోయినపల్లి సిఖ్ విలేజ్ ప్రధాన రహదారిలో అలరారుతున్నది. నగరంలో ఉన్న ప్రముఖ దేవాలయాలలో ఇదొక ఆకర్షణీయ పుణ్యక్షేత్రం., ఈ క్షేత్ర ఆవిర్భావ విశేషాలు మహత్యం శ్రీ పరాశర సంహిత, శ్రీమద్రామాయణం మొదలైన పురాణాలలో ప్రస్తావింపబడ్డాయి.

ఈ ఆలయం వెలియుటకు గల పురాణ గాధను భక్తులు చెప్పుకుంటారు. వారి కథనము ప్రకారం పూర్వం యాగాలుడు అనే రాక్షసుడు శివ వరప్రసాదిగా దుష్ట చింతన మరియు గర్వంతో దేవ గంధర్వ కిన్నెర కింపురుష, సిద్ధులను, ఋషులను, సామాన్య ప్రజలను విపరీతంగా పీడించసాగాడు. ఆ రాక్షసుని బాధలు భరించలేక దేవతలు విష్ణువును కలిసి తమ మొర విన్నవించుకోగా, విష్ణుమూర్తి శివుని కలిసి ప్రస్తావించగా, శివుడు తనేమీ చేయలేననియ , పైగా యాగాలుడు తనకు ప్రీతిపాత్రుడైన భక్తుడని అనగా, విషువే ఆ దానవుని సంహరించెదనని శపథం చేశాడు. శివ భక్తి అనే కవచంతో రక్షణ పొందుతున్న తన భక్తులను ఎవ్వరూ సం-



హరించలేరని అనుచు శివుడు విష్ణువు ప్రతిపాదనకు అడ్డుపడ్డాడు.

శివుడు `విష్ణుమూర్తిల సంవాదం పెరగటంతో,విష్ణుమూర్తి శివునితో తాను యాగాలుడిని సంహరిస్తానని లేకపోతే శివుడికి దాసుడునవుతానని ప్రతిజ్ఞ చేశాడు. దానికి ప్రత్యుత్తరంగా పరమేశ్వరుడు ` ఒకవేళ ఆ రాక్షసుని విష్ణువు సంహరిస్తే తాను శ్రీహరికి దాసునిగా



డా॥కె.రామానందం

ఉంటానన్నాడు.

విష్ణుమూర్తి దుష్ట శిక్షణే ప్రధానంగా ఎంచి, ఉపాయం పన్ని మోహిని రూపం ధరించి, ఆ రాక్షసునిచే సురాపానం చేయించి, ఒళ్ళు తెలియని స్థితిలో ఉన్న అతనిని వృకరూపం ధరించి సంహరించి తన భక్తులకు బాసటగా నిలుస్తాడు. సృష్టి, స్థితి, లయ కారుకులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఒకరికొకరు దాసులు కాకూడదని అది అనుచితమని విష్ణుమూర్తి అభ్యంతరం చెబుతాడు. అయితే శివుడు మాట తప్పిన వాడని అపవాదు రాకూడదు కావున, త్రేతాయుగంలో తాను రామావతారం ఎత్తినప్పుడు అంజనీపుత్రుడై జన్మించి నీ ప్రతిజ్ఞ నెరవేర్చుకోమని విష్ణువు సలహా ఇస్తాడు.

ఆంజనేయుడు జన్మ వృత్తాంతం పురాణేతిహాసాలలో ఇలా వర్ణింపబడినది. పార్వతీ పరమేశ్వరులు ఆకాశమార్గాన సంచరిస్తూ శ్రీహరివాసమైన వెంకటాచలానికి వస్తారు. అచ్చటి ప్రకృతి శోభతో నిండి ఉన్న అటవీ ప్రాంతంలో వానర మిధునం క్రీడించడం పార్వతి కంటబడింది. వారిలా



తాము కూడా విహరించాలని పార్వతి ఆకాంక్షించింది. ఈ విషయం పరమేశ్వరుడు గ్రహించాడు. ఆదిదంపతులు వానర రూపం ధరించి క్రీడిస్తారు. దేవతా శక్తిమయ తేజోవంతమయమైన రేతస్సును వానర రూపం గల పార్వతి భరించలేక అగ్నిలో వేసింది. అగ్నిదేవుడు కూడా దానిని భరించలేక, వాయుదేవుడికి అప్పగిస్తాడు. వాయుదేవుడు ఆ తేజోపుంజాన్ని అంజనాద్రిపై తపస్సు ఆచరిస్తున్న అంజనాదేవి చేతిలో పెడతాడు. ఆమె దానిని ఫలంగా భావించి మింగి వేస్తుంది. ఫలితంగా వైశాఖ శుద్ధ దశమి శుభదినాన పండంటి పుత్రునకు జన్మనిస్తుంది. అంజనాపుత్రుడు కనుక అతనిని ఆంజనేయుడు అన్నారు.

దశరథ మహారాజు ఆస్థానంలో ఆస్థానముఖ్యులలో జాబిలి మహర్షి ఒకరు. దశరథ మహారాజుచే పుత్రకామేష్టి యజ్ఞం చేయించగా ఆయన నలుగురు పుత్రులను పొందాడు. భరతునితో పాటు జాబిలి మహర్షి, అరణ్యవాసం చేస్తూ చిత్రకూటంలో ఉన్న రామలక్ష్మణులను కలిసి, దశరథుని మరణవార్త చెప్పి అయోధ్యకు తిరిగి వచ్చి రాజ్యం స్వీకరించమని భరతుడు వేడుకుంటాడు. రాముడు నిరాకరిస్తాడు అయితే జాబిలి మహర్షి భరతుని కోరికను మన్నించి అయోధ్యను పాలించమని ఒత్తిడి చేయగా, శ్రీరాముడు కోపగించి 'అఘపాశబంధం'తో జాబిలి పీడించబడతారని అంటాడు.

శ్రీరామచంద్రుడు తన 14 సంవత్సరాల అరణ్యవాసం పూర్తి చేసుకోవడం రావణుని చంపిన కారణంగా బ్రహ్మహత్యా దోషనివారణ నిమిత్తం రామేశ్వర పుణ్యక్షేత్రంలో శివలింగ ప్రతిష్ఠ శ్రీరాముడు జరిపాడు. జాబిలి మహర్షి 'భవపాశబంధం' నుంచి విముక్తి పొందుటకు రుద్రాంశ సంభూతుడైన వీరాంజనేయుని ప్రతిష్ఠించుటకు అనువైన స్థలాన్ని వెతకసాగాడు. శ్రీరామచంద్రుడే హనుమంతునికి బహుకరించిన హనుమత్పురం అనువైన ప్రదేశంగా ఎంచుకుని, ఆ ప్రదేశమందు వీరాంజనేయుని ఆయన వామభాగాన గణేషుని జాబిలి ప్రతిష్ఠ చేశాడు. శ్రీరాముడు ఈ విషయాన్ని విని జాబిలి యొక్క 'అఘపాశబంధం' విముక్తి కలిగిందని శ్రీరాముడు జాబిలికి విన్నవిస్తాడు. జాబిలి మహర్షికి విముక్తి లభించినందున ఈ పురాన్ని 'పాశబంధ హర పుర'మని వ్యవహరించబడుతుందని శ్రీరాముడే స్వయంగా అన్నట్లు పురాణాలు తెలుపుతున్నాయి.

ఈ 'పాశబంధహరపురం'లో జాబిలి మహర్షి కొంతకాలం ఉండి 'సామవేదీయ రుద్రాక్షోపనిషత్తు' మరియు 'శ్రీవీరాంజనేయ ఉపనిషత్తు' గ్రంథాలు రచించాడు. ఈ క్షేత్రం యొక్క పేరు కాలక్రమేణ పాశబంధపురంగా, మరలా తాడు బంధపురంగా, మరల 'తాడుబందు'గా నేడు 'తాడ్‌బంద'గా వ్యవహరింపబడుచున్నది. ఈ క్షేత్రమందలి స్వామిని కుమ్మరి మొల్ల కులానికి చెందిన కుమ్మరి మల్లమ్మ ధూప నైవేద్యాలు పెట్టేది. ఆమె తర్వాత అచ్చుట స్వామికి ధూప దీప నైవేద్యాలు కరువయ్యాయి.

1929 వ సంవత్సరంలో భాగ్యనగరవాసులు ప్లేగు వ్యాధికి లోనై, కొందరు తమ ఇళ్ళు వదిలి 'తాడుబందు' ప్రాంతంలోని మైదానంలో ఉండి తమను రక్షించుకున్నారు. అక్కడ గుడారాలలో కాలం గడుపుతున్న బూరుగు వీరయ్య శ్రేష్టి, కొండా రఘురాములు గుప్త, కైలాదైవం గుప్త గార్లకు ఒక దివ్యశిలను, అచ్చుటి ముళ్ళ పొదలలో కనుగొని, స్వామివారికి ధూపదీప నైవేద్యాలు సమర్పించుకుంటూ ఉండేవారు. ప్లేగు వ్యాధి తగ్గి తమ గృహాలకు తిరిగి వచ్చినా వీరయ్య గుప్త గారు ప్రతి వారం వచ్చి పూజలు నిర్వహించేవారు. ఆ దివ్యశిల ఉన్న సొంత భూమిని గుప్త గారు ఆలయ నిర్మాణం నిమిత్తం శ్రీవారి పేర దానం పొంది, భక్తుల సహాయ సహకారములతో సుందరమైన, విశాలమైన ఆలయం నిర్మించి




శాస్త్రోక్తంగా నిత్య పూజలు నిర్వహిస్తున్నారు.

ఆలయ నిర్మాణం తర్వాత భక్తుల రద్దీ పెరుగుతూ, ఆదాయం కూడా పెరుగుతూ వచ్చింది. ఆలయ ధర్మకర్తల సంఘం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ఒక ప్రముఖ ఆలయంగా రూపొందించారు. ఆలయ ప్రాంగణంలో ఒంటె వాహనాన్ని గర్భాలయం ఎదురుగా చూడవచ్చును. ఇచ్చుటి ఆలయంలో వీరాంజనేయుని లీలలు ప్రతిబింబించే అత్యంత సుందరమైన పెద్ద తైలవర్ణ చిత్రాలను శ్రీ చిగుళ్ల మనోహరచారిచే రూపొందించి ఆలయ నాలుగు గోడలపై అలంకరించారు. అవి చూడముచ్చటగా ఉంటాయి. హనుమంతుని జీవిత విశేషాలు గల ఈ అపురూప చిత్రాలను చూచే భాగ్యం ఈ ఆలయంలో భక్తులకు లభిస్తుంది.

ఈ స్వామికి అనేక ప్రత్యేక పూజలు, అభిషేకము, లక్ష ఆకుపూజ, వడమాల అలంకరణ, వివిధ అలంకారములు, శ్రీరామనవమి, దసరా, హనుమజ్జయంతి, ధనుర్మాస పూజలు, నివేదనలు, అంగరంగ వైభవంగా నిర్వహిస్తూంటారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలు కడు రమ్యంగా, భక్త జనుల సమక్షంలో ఐదు రోజులు అఖండ వైభవంగా నిర్వహిస్తుంటారు.

ఆలయ ఆవరణలో చక్కటి కల్యాణ మండపం, గెస్ట్ రూములు, వేద పాఠశాల, ఆలయ అర్చకులకు క్వార్టర్స్, చిన్న ఉద్యానవనము వగైరా సౌకర్యములు ఏర్పాటు చేశారు. నవవిధ భక్తుల్లో దర్శన భక్తిని కోరుకునే భక్తులు ఈ స్వామి దివ్యమంగళ రూపాన్ని చూచి తీరవలసిందే. శ్రీరాముడి తర్వాత అంత మహోన్నతుడిగా వాల్మీకి చిత్రించిన పాత్ర హనుమంతుడిదే. అందుకనే రాముడితో పాటు ఆంజనేయుడు చరితార్థుడైనాడు. ఆయన చిరంజీవిగా నిలిచిపోయాడు. కలియుగంలో చిరంజీవిగా సర్వే సర్వత్రా దర్శనమిస్తూ, ఆర్తితో సేవించిన వారికి అండగా ఉంటున్నాడు ` ఆంజనేయ స్వామి. తనను కొలిచిన వారికి బుద్ధిని, మనోబలాన్ని ప్రసాదిస్తాడు. ఆయన అనుగ్రహానికి పాత్రులైతే సర్వసౌఖ్యాలతో వర్ధిల్లుతారనడంలో ఏ మాత్రం సందేహం లేదు.

# జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించండి
## -ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులు, ఎంపీలను కలిసిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు



కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్)రాష్ట్ర నాయకులు పలువురు కేంద్ర మంత్రులను, పార్లమెంటు సభ్యులను కలిసి విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల సమస్యలపై సోమవారం జంతర్ మంతర్ లో ధర్నా నిర్వహించిన ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బండి విజయ్ కుమార్ తదితరులు మంగళవారం కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీకి చెందిన పార్లమెంట్ సభ్యులు మల్లు రవి, టీఆర్ ఎస్ పార్టీకి చెందిన వద్దిరాజు రవిచంద్ర తదితరులకు వినతిపత్రాలు అందజేశారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులకు ఉన్న రైల్వే రాయితీ పాస్ లను గత కోవిడ్ సందర్భంగా రద్దు చేశారని, ఈ సదుపాయాన్ని పునరుద్ధరించాలని వారు కోరారు. దేశవ్యాప్తంగా రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్ సదుపాయం కల్పిస్తూ జాతీయ పెన్షన్ పథకం అమలు చేయాలని, జర్నలిస్టుల రక్షణకు పార్లమెంటులో ప్రత్యేక చట్టం చేయాలని వారు కోరారు. జర్నలిస్టులకు, సొసైటీలకు ప్రభుత్వ స్థలాలు కేటాయించే విషయం పై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునః సమీక్షించి జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.



జర్నలిస్టులకు సంబంధించిన ఆయా సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నేషనల్ కౌన్సిల్ సభ్యులు కుంచం శ్రీనివాస్, పర్కాల సమ్మయ్య గౌడ్, కె.రమాదేవి,పద్మనాభరావు,నాయకులు గోపాల్, మోయిజ్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రెడిటేషన్ కమిటీల్లో టీడబ్ల్యూజేఎఫ్‌కు ప్రాతినిధ్యం ఇవ్వాలి

**-రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు**

**-జర్నలిస్టుల హక్కులకు మరోసారి న్యాయస్థానం అండ**

**-ఇది మా టీడబ్ల్యూజేఎఫ్ సభ్యుల విజయం-మామిడి సోమయ్య**

రాష్ట్రంలోని అన్ని జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ (డీఎంఏసీ)ల్లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్)కు ప్రాతినిధ్యం కల్పించాలని తెలంగాణ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. మీడియా అక్రెడిటేషన్ కమిటీల ఏర్పాటు విషయంలో జర్నలిస్టు సంఘాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరాన్ని హైకోర్టు స్పష్టం చేసింది. అన్ని అర్హతలున్న టీడబ్ల్యూజేఎఫ్ కు అక్రెడిటేషన్ కమిటీల్లో ప్రాతినిధ్యం ఇవ్వకపోవడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీలను ఏర్పాటు చేసే సమయంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్‌కు ప్రాతినిధ్యం ఇవ్వకుండా వ్యవహరించడాన్ని సవాల్ చేస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు దాఖలైన రిట్ పిటిషన్‌పై గత ఆరు నెలలుగా పలుమార్లు విచారణ జరిగింది. ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ కార్యాలయ న్యాయవాదులు, పిటిషనర్ తరపున న్యాయవాదులు తమ వాదనలు కోర్టు ముందు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు, ప్రభుత్వ ఉత్తర్వులు, మీడియా అక్రెడిటేషన్ కమిటీల ఏర్పాటు విధానం, జర్నలిస్టు సంఘాల ప్రాతినిధ్యానికి సంబంధించిన నిబంధనలను పరిశీలించిన అనంతరం తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, జస్టిస్ మొహినుద్దీన్‌ల ధర్మాసనం సోమవారం తీర్పును వెలువరించింది. రాష్ట్రంలోని అన్ని జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీల్లో టీడబ్ల్యూజేఎఫ్‌కు కూడా తగిన ప్రాతినిధ్యం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

ఈ తీర్పుతో రాష్ట్రంలోని జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీల్లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్‌కు అధికారిక ప్రాతినిధ్యం లభించే మార్గం సుగమమైంది. జర్నలిస్టు సంఘాల మధ్య సమాన అవకాశాలు, పారదర్శకత, న్యాయబద్ధమైన ప్రాతినిధ్యానికి ఈ తీర్పు దోహదపడుతుందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

హైకోర్టు తీర్పును తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకత్వం హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతించింది. జర్నలిస్టుల హక్కులు, గౌరవం, సంఘాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలన్న తమ పోరాటానికి ఇది న్యాయపరమైన విజయమని పేర్కొంది. ఈ తీర్పును వెంటనే అమలు చేసి, అన్ని జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీల్లో టీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సంఘం నాయకులు కోరారు. ఈ తీర్పు భవిష్యత్తులో మీడియా అక్రెడిటేషన్ కమిటీల ఏర్పాటులో అన్ని గుర్తింపు పొందిన జర్నలిస్టు సంఘాలకు సముచిత ప్రాధాన్యం కల్పించేలా మార్గదర్శకంగా నిలుస్తుందని జర్నలిస్టు వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. న్యాయం, ధర్మం తమవైపు ఉందని, హైకోర్టు ఇచ్చిన తీర్పు తమ సంఘం సభ్యుల విజయం అని రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య పేర్కొన్నారు.


భోగాపురం అల్లూరి సీతారామరాజు విమానాశ్రయం


స్కైరూట్ ఏరోస్పేస్ ఫ్యాక్టరీలో రాకెట్ అసెంబ్లీ

RNI No. TELTEL/2011/39497 AUGUST 2026 POSTAL NO. HSE/1043/2017-19
Date of Publication:1st August Date of Posting:8th August




Published, Edited and Printed by T Shanti at Flat No. 504, Tower A06, Rajiv Sahabhavana Nagole-Bandlaguda, Hyderabad-500068. Phone 9490571297 email: teega51@gmail.com , www.chaitanyam.net, Printed at Printography, 5-4-114,Ranigunj, Secunderabad-500001